



Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్






సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 58 | గురువారం 24 జూలై 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



# మూడోరోజూ అట్టుడికిన పార్లమెంటు

- బీహార్ ఎస్ఐఆర్, పహల్గాంపై చర్చకు ప్రతిపక్షాల పట్టు
- ఆందోళనల మధ్యే లోక్‌సభలో రెండు బిల్లులు
- 29 నుంచి ఆపరేషన్ సిందూర్‌పై చర్చ

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, జూలై 23

పహల్గాం ఉగ్రదాడి, బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణ అంశాలు పార్లమెంటు వర్షాకాల సమావేశాలను కుదిపేస్తున్నాయి. సమావేశాలు ప్రారంభమైన వరుసగా మూడో రోజు బుధవారం కూడా ఉభయ సభలు అట్టుడికాయి. బీహార్ ఎస్ఐఆర్, పహల్గాంపై చర్చకు అంగీకరించ కుండా కేంద్రం అనుసరిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ ప్రతిపక్షాల ఆందోళనతో పార్లమెంటు ఉభయ సభలు స్తంభించాయి.

- మిగతా 2లో..





## జింబాబ్వేలో ఘోర రోడ్డు ప్రమాదం

- 17 మంది మృతి

జింబాబ్వే– సూర్య వాస్తవం, జూలై 23

ఈశాన్య జింబాబ్వేలో మినీబస్సు , రవాణా ట్రక్కు ఢీకొన్న ప్రమాదంలో 17 మంది మరణించారని పోలీసులు తెలి పారు. రాజధాని హరారేకు ఆగ్నే యంగా 25 కిలోమీటర్ల (15.5 మైళ్ళు) దూరంలో ఉన్న

2లో

## ఉప రాష్ట్రపతి రేసులో
# ఆ నలుగురు!

- పార్లమెంట్ వర్షాకాల సమావేశాల వేళ ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్ రాజీనామా
- తదుపరి ఉప రాష్ట్రపతిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ
- ఉప రాష్ట్రపతి రేసులో నితీశ్, శశిధరూర్, ఇద్దరు లెఫ్టినెంట్ గవర్నర్‌లు

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, జూలై 23

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల వేళ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి హఠాత్తుగా రాజీనామా చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఆయన రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించడంతో తదుపరి ఉపరాష్ట్రపతి ఎవరు అనే



దానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఉపరాష్ట్రపతి పదవి రేసులో నలుగురి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఇందులో ముఖ్యంగా బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ పేరు కూడా ఉంది. నితీశ్ కుమార్‌ను ఉపరాష్ట్రపతిగా ఎంపిక చేయడం కోసమే జగదీప్ ధన్‌ఖడ్‌తో రాజీనామా చేయించారనే


- మిగతా 2లో..

## ద్వైపాక్షిక సంబంధాల
# బలోపేతమే లక్ష్యం!

- బ్రిటన్, మాల్దీవుల పర్యటనకు ప్రధాని మోడీ

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, జూలై 23

బ్రిటన్, మాల్దీవుల్లో నాలుగు రోజుల పర్యటనకు ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం బయలుదేరి వెళ్లారు. ఈ పర్యటన వల్ల ఆ రెండు దేశాలతో భారత్ ద్వైపాక్షిక, ఆర్థిక సంబంధాలు మరింత పెంపొందుతాయని ఆయన పేర్కొన్నారు. పర్యటనకు బయలుదేరడానికి ముందు ఆయన ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. భారత్, బ్రిటన్‌ల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం వుందని తెలిపారు. ఇటీవలి కాలంలో గణనీయమైన ప్రగతి సాధించామన్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, వినూత్న ఆవిష్కరణలు, రక్షణ, విద్య,



పరిశోధన, ఆరోగ్యం, ప్రజల మధ్య సంబంధాలు వంటి పలు రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకారం విస్తృతంగా వుందన్నారు. ఈ పర్యటనా కాలంలో ఆర్థిక భాగస్వామ్యాన్ని

- మిగతా 2లో..



## ట్రంప్ ప్రకటన రజతోత్సవానికి చేరుకున్నా..
## మౌనం వీడని ప్రధాని

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, జూలై 23

భారత్, పాక్‌ల మధ్య కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించానంటూ అమెరికా అధ్యక్షులు ట్రంప్ వాదన రజతోత్స వానికి చేరుకున్నప్పటికీ, ప్రధాని మోడీ మౌనంగానే

2లో



## ఎపిఇఆర్‌సి ఛైర్మన్‌ను ఎప్పటిలోగా
## నియమిస్తారు?:

- హైకోర్టు

అమరావతి – సూర్య వాస్తవం, జూలై 23

ఏపి విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) ఛైర్మన్‌ను ఎప్పటిలోగా నియమి స్తారో చెప్పాలని రాష్ట్రానికి హైకోర్టు ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంధనశాఖ ప్రత్యేక


2లో

# ఏడాదిలో రూ.120 బిలియన్ల పెట్టుబడులు

- ఇన్వెస్టోపియా సదస్సులో సిఎం - ఎపిఇబిడి-యుఎఇ మధ్య ఒప్పందాలు

అమరావతి – సూర్య వాస్తవం, జూలై 23

అంతర్జాతీయ పెట్టుబడులకు ఎపి గేట్‌వేగా మారుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. విజయవాడలో బుధవారం జరిగిన ఇన్వెస్టోపియా సదస్సులో ఆయన మాట్లాడారు. యుఎఇ మంత్రి అబ్దుల్ బిన్ లౌక్ ఆల్ మరిని తాను కలిసిన సమయంలో తొలుత ఎపికి వచ్చి చూసిన తరువాత దేశంలో ఇతర ప్రాంతాలకు వెళ్లాలని తాను కోరారని, ఆయన ఎపికి వచ్చారని తెలిపారు. ఏడాదిలో ఎపిలో 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షిస్తుందని అన్నారు. అందుకు అనువుగా రాష్ట్రంలో విధానాలకు రూపకల్పన చేశామని తెలిపారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులకు తాను సమన్వయకర్తగా ఉంటానని పేర్కొన్నారు. సుదీర్ఘ తీర ప్రాంతంలో చమురు, గ్యాస్, ఫుడ్ ప్రాసెసింగ్, మైనింగ్, పర్యాటకం, ఆతిథ్యం



వంటి వేర్వేరు రంగాల్లో అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతికూలతలు ఉన్నా దుబాయిని పర్యాటక స్వర్గధామంగా అకడి పాలకులు మార్చారని తెలిపారు. 2029 నాటికి

- మిగతా 2లో..

## నారా లోకేశ్ చొరవతో...
# విశాఖకు పెట్టుబడుల వెల్లువ!

- నాలుగు భారీ ప్రాజెక్టులకు ఆమోదం
- చంద్రబాబు అధ్యక్షతన 9వ ఎస్ఐపీబీ సమావేశం
- ఐటీ రంగంలో రూ.20,216 కోట్ల పెట్టుబడులు... 50,600 ఉద్యోగాలు కల్పన

అమరావతి – సూర్య వాస్తవం

ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ చొరవతో రాష్ట్రానికి పేరుమోసిన కంపెనీలు వస్తున్నాయి. తద్వారా విశాఖ మహానగర రూపురేఖలు మారబోతున్నాయి. అమరావతి సచివాల యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన



- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# అంగన్వాడీ టీచర్ దాష్టీకం

- బాలికను వేడి గంజి పై తోసేసిన వైనం
- తీవ్రంగా గాయపడ్డ బాలిక
- మధ్యాహ్నం జరిగిన సంఘటన

రామకుప్పం – సూర్య వాస్తవం, జూలై 23

రామకుప్పం మండలం సింగసముద్రంలో అంగన్వాడీ టీచర్ ఓ బాలికను వేడివేడి గంజి పై తోసి వేయడంతో ఆ బాలిక గాయాల పాలైన సంఘటన బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని సింగ సముద్రం అంగన్వాడీ కేంద్రంలో పనిచేస్తున్న అమృతవల్లి అనే అంగన్వాడీ టీచర్ ఇద్దరు విద్యార్థులు కొట్లాడుకుంటుంటే వారిని విడదీసేందుకో లేక వేరే కారణం చేతనో తోసి వేయడంతో అఖిల అనే బాలిక

- మిగతా 2లో..





## ఉప రాష్ట్రపతి రేసులో

# ఆ నలుగురు!

(మొదటిపేజీ తరువాయి)

వార్తలు వినిపిస్తున్నాయి. పలు ప్రతిపక్షాలు ఇదే విషయంపై ఆరోపణలు చేస్తున్నాయి. బీహార్‌లో సొంత పార్టీ నేతను సీఎం స్థానానికి ఎంపిక చేసి, నితీశ్ కుమార్ తనయుడికి ఉప ముఖ్యమంత్రి పదవి అప్పగించే ఆలోచనలో భాగంగా కేంద్రంలోని బీజేపీ జగదీప్ ధన్‌ఖడ్‌తో రాజీనామా చేయించిందని అంటున్నారు. అయితే తాను ఆరోగ్య కారణాల రీత్యా రాజీనామా చేస్తున్నట్లుగా జగదీప్ ధన్‌ఖడ్ ప్రకటించారు.

మరోవైపు కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యాఖ్యలు చేస్తూ కాంగ్రెస్ పార్టీకి క్రమంగా దూరమవుతున్న సీనియర్ ఎంపీ శశిథరూర్ పేరు కూడా ఉపరాష్ట్రపతి రేసులో వినిపిస్తోంది. ఈయన త్వరలోనే కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పి కమలదళంలో చేరనున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కేరళలో సొంత పార్టీ నేతలే ఆయనను పక్కన పెట్టినట్లు ప్రకటించడం జరిగింది. ఈ క్రమంలో ఆయనకు ఉపరాష్ట్రపతి పదవి ఇస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

ఈ ఇద్దరితో పాటు ఢిల్లీ, జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్లలో ఒకరికి అవకాశం ఇవ్వవచ్చని కూడా వార్తలు వస్తున్నాయి. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా గత మూడేళ్లుగా ఢిల్లీ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆప్ అధికారంలో ఉన్న సమయంలో అనేక విషయాల్లో నాటి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో విభేదించి తరచూ వార్తల్లో నిలిచారు. ఇటీవల జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఓటమికి ఎల్జీ సక్సేనాతో వివాదం కూడా ఒక కారణమని భావిస్తున్నారు. దీంతో ఆయన కేంద్రం దృష్టిలో పడ్డారు.

అలానే ప్రస్తుతం జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉన్న సీనియర్ బీజేపీ నేత మనోజ్ సిన్హా పదవీ కాలం వచ్చే నెల 6వ తేదీతో ముగియనుంది. ఈయన గతంలో పార్టీ జాతీయ కౌన్సిల్‌లో సభ్యుడిగా వ్యవహరించడంతో పాటు మోదీ తొలి క్యాబినెట్‌లో కేంద్ర సహాయ మంత్రిగానూ పని చేశారు. ఆర్టికల్ 370 రద్దు అయిన తర్వాత జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ గా బాధ్యతలు చేపట్టిన సిన్హా పాలనలో తనదైన ముద్ర వేశారు. ఈ క్రమంలో సిన్హా పేరు కూడా ఉపరాష్ట్రపతి రేసులో వినిపిస్తోంది.

## ద్వైపాక్షిక సంబంధాల

# బలోపేతమే లక్ష్యం!

(మొదటిపేజీ తరువాయి)

పెంపొందించుకోవడానికి కృషి చేస్తామన్నారు. ఇరు దేశాల్లోనూ ఉపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి పెడుతూ చర్యలు వుంటాయన్నారు. రాజు చార్లెస్-3తో కూడా మోడీ భేటీ కానున్నారు. ఆ తర్వాత అధ్యక్షుడు ముయిజు ఆహ్వానం మేరకు మోడీ మాల్దీవులు వెళతారు. మాల్దీవుల 60వ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 60ఏళ్లు కావస్తోందని మోడీ పేర్కొన్నారు. సముద్ర జలాల భద్రతా భాగస్వామ్యంతోపాటు సమగ్ర ఆర్థిక సంబంధాలను కూడా ముందుకు తీసుకెళ్లడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు మోడీ ఆ ప్రకటనలో తెలిపారు.

# ఏడాదిలో రూ.120 బిలియన్ల పెట్టుబడులు

(మొదటిపేజీ తరువాయి)

భారతదేశం అతిపెద్ద మూడో ఆర్థిక వ్యవస్థగా మారుతుందని అన్నారు. యుఎఇతో ఉన్న సత్సంబంధాల ద్వారా మరిన్ని పెట్టుబడులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికాలో సిలికాన్ వ్యాలీ మాదిరి అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. పెట్టుబడిదారులు ప్రతిపాదనలతో వస్తే అన్ని అవకాశాలు కల్పించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సిఎం పేర్కొన్నారు. ఈ సందర్భంగా యుఎఇ-ఎపి మధ్య అవగాహన ఒప్పందం జరిగిందన్నారు. ఈ సదస్సులో మంత్రి టిజి భరత్, సిఎస్ కె విజయానంద్, సిఐఐ ప్రెసిడెంట్ ఆర్ ముకుందన్, లూలూ ఇంటర్నేషనల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ యూసుఫ్ ఆలీ పాల్గొన్నారు. అనంతరం యుఎఇ మంత్రితో ద్వైపాక్షిక చర్చలు జరిగాయి.

# పేద ప్రజల ఆశాజ్యోతి సుగవాసి పాలకొండ్రాయుడు

**- నాన్న ఆశయ సాధనే నా లక్ష్యం**
**- నాకు చంద్రబాబు, లోకేష్ బాబు ఏమి చెప్పారో అదే చేస్తున్నాను**
**-2029 ఎన్నికలలో తప్పక పోటీచేస్తా**
**- తెలుగుదేశం పార్టీ అభిమానులకు, సుగవాసి అభిమానులకు అండగా వుంటా**
**- బడుగు బలహీన వర్గాల రాజకీయ చైతన్యం కోసమే సంస్మరణ సభలు**
**- రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు**



**రాయచోటి-సూర్య వాస్తవం, జూలై 23:** పేద ప్రజల గుండెచప్పుడు, ప్రజానాయకుడు, పెద్దాయనగా పిలిపించుకున్న మాజీ ఎంపీ,మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండరాయుడు బడుగు,బలహీన వర్గాల ఆశాకిరణం అని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు అన్నారు. బుధవారం రోజు రాయచోటి రూరల్ మండలం శిబ్యాల గ్రామం ఒదివేడు బలిజపల్లెలో సుగవాసి పాలకొండ్రాయుడు సంస్మరణ సభను స్థానిక ప్రజలు, నాయకులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి బలిజపల్లె ప్రజల ఆహ్వానం మేరకు హాజరైన ప్రసాద్ బాబు స్థానిక ప్రజలతో కలిసి స్వర్గీయ మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడు చిత్రపటానికి పూల మాలవేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజవర్గంలో బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పెద్దాయన పాలకొండ్రాయుడు రాజకీయంగా, ఆర్థికంగా అండగా నిలిచారన్నారు. పాలకొండరాయుడు తో తమకున్న అనుబంధాన్ని బలిజపల్లె ప్రజలు పాత రోజులను గుర్తు చేసుకుని భావోద్వేగానికిలోనయ్యారు. తనతండ్రివేసినఅడుగుజాడల్లోనే ముందుకు వెళ్లి బడుగు,బలహీన వర్గాలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ మీకు ఏ అవసరం వచ్చినా నేనుంటానంటూ భరోసా కల్పించారు.

# మూడోరోజూ అట్టుడికిన పార్లమెంటు

(మొదటిపేజీ తరువాయి)

వాయిదాల నడుమ ఎలాంటి చర్చ జరగకుండానే గురువారానికి వాయిదాపడ్డాయి. బుధవారం ఉదయం 11 గంటలకు ఉభయ సభలు మొదలవగానే.. బీహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ (ఎస్ఐఆర్) పేరుతో చేపట్టిన ఓటర్ల జాబితా సవరణపై ప్రతిపక్ష ఎంపిలు నిరసన గళం వినిపించారు. ఎన్నికలకు రెండు నెలల ముందు ఆగమేఘాల మీద ఓటర్ల జాబితాను సవరించడం ప్రజాస్వామ్య విరుద్ధమంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల వేళ బిజెపి వ్యతిరేక ఓటర్లను జాబితా నుంచి తొలగించేందుకు ఎన్నికల సంఘం కేంద్రంతో కలిసి కుట్రకు తెరలేపిందని విమర్శించారు. ఎన్నికల ముందు ఓటర్ల జాబితాను సవరించడం ఈ మధ్య కాలంలో పరిపాటిగా మారిందని పేర్కొన్నారు. ఈ విషయంపై తాము ఇచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చకు ప్రతిపక్ష ఎంపిలు డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల ఆందోళనతో ఉభయసభలు మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడ్డాయి. ఆ తరువాత సభలు తిరిగి ప్రారంభమైనప్పటికీ లోక్‌సభలో అదే పరిస్థితి పునరావృతమైంది. ప్రతిపక్ష ఎంపిలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ బీహార్ ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు డిమాండ్ చేశారు. ఫలితంగా సభలో తీవ్ర గందరగోళం చోటుచేసుకుంది. లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. అంతకుముందు ప్రతిపక్షాల ఆందోళన మధ్యే కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ జాతీయ డోపింగ్ నిరోధక (సవరణ) బిల్లు, జాతీయ క్రీడా పాలన బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లులు క్రీడా రంగంలో పారదర్శకతను పెంపొందించే లక్ష్యంతో రూపొందించినట్లు తెలిపారు. తిరిగి ప్రారంభమైన ఉభయ సభల్లో పరిస్థితుల్లో ఎటువంటి మార్పు కనబడలేదు. దీంతో నిమిషాల్లో ఉభయ సభలు గురువారానికి వాయిదా పడ్డాయి.

### 29 నుంచి ఆపరేషన్ సిందూర్‌పై చర్చ

వర్షాకాల సమావేశాల్లో ఆపరేషన్ సిందూర్‌పై ఈ నెల 29న ఆ చర్చ జరగనుంది. లోక్‌సభలో 16 గంటలు, రాజ్యసభలో 9 గంటలపాటు చర్చించేందుకు సమయాన్ని కేటాయించారు. బుధవారం జరిగిన బిజినెస్ అడ్వైజరీ మీటింగ్ (బిఎసి)లో దీనిపై నిర్ణయం తీసుకున్నారు. చర్చ ముగిసిన తరువాత రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమాధానం ఇవ్వనున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సమాధానం ఇవ్వాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

### ఆపరేషన్ సిందూర్‌ను ఆపినట్లు ట్రంప్ 25 సార్లు చెప్పడంలో మర్మమేంటి?

ఆపరేషన్ సిందూర్‌ను ఆపింది తానేనని ట్రంప్ 25 సార్లు చెప్పడంలో మర్మమేంటి? అని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. పార్లమెంటు ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోందని ఒకవైపు చెబుతున్నారని, మరోవైపు విజయం సాధించినట్లు చెబుతున్నారని, డొనాల్డ్ ట్రంప్ ఆపరేషన్ సిందూర్‌ను ఆపింది తానే అని 25 సార్లు చెప్పారని, దీంట్లో ఏదో మర్మం ఉందని, మన విదేశాంగ విధానాన్ని ఏ దేశం కూడా సపోర్టు చేయలేదని రాహుల్ గాంధీ అన్నారు. దీనిపై కేంద్రం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశ భక్తులమని చెప్పుకుంటున్న వారు సమాధానం చెప్పకుండా తప్పించుకుని తిరుగుతున్నారని, ప్రధాని దీనిపై కనీసం ఒక్క ప్రకటనా చేయలేదని అన్నారు. 'ఇది తన పనేనని ప్రకటన చేయడానికి ట్రంప్ ఎవరు? ఇది ఆయన పని కాదు. ప్రధాని ఇంతవరకూ స్పందించకపోవడం వాస్తవం' అని పేర్కొన్నారు.

### పార్లమెంటు ఆవరణలో ప్రతిపక్షాల ఆందోళన

బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ (ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష పార్టీల నేతలు పార్లమెంట్లో ఆందోళన చేపట్టారు. బుధవారం పార్లమెంటు ఉభయ సభల ప్రారంభానికి ముందు మకర ద్వారం ఎదురుగా ప్రతిపక్ష ఇండియా బ్లాక్ పార్టీల నేతలు ప్లకార్డులు చేబూని ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నినాదాలు హోరెత్తించారు. ప్రభుత్వ ఉద్దేశం, చట్ట బద్ధతను స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఎస్‌పి నేత అఖిలేష్ యాదవ్, డిఎంకె నేతలు కనిమొళి, టిఆర్ బాలు, ఎ రాజా, ఆర్‌జెడి ఎంపిలు మీసా భారతి, మనోజ్ కుమార్ ఝా, సిపిఎం ఎంపిలు అమ్రారామ్, సచ్చిదానందన్ తదితరులు పాల్గొన్నారు. బీహార్‌లో ఎస్ఐఆర్ సమస్య, పహల్గామ్ ఉగ్రవాద దాడి, నిఘా వైఫల్యాలపై పార్లమెంటులో చర్చ జరపాలని ఎస్‌పి ఎంపి డింపుల్ యాదవ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ అంశాలను నివారించడానికి ప్రయత్నిస్తోందని ఆమె విమర్శించారు.

## ఎపిఇఆర్‌సి ఛైర్మన్‌ను ఎప్పటిలోగా

# నియమిస్తారు?:

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాన కార్యదర్శి, ఇతర ప్రతివాదులకు నోటీసులిచ్చింది. విచారణను సెప్టెంబర్ 17కు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశించింది. ఎపిఇఆర్‌సి ఛైర్మన్ పోస్టును భర్తీ చేయకపోవడాన్ని డాక్టర్ దొంతిరెడ్డి నరసింహారెడ్డి సవాల్ చేస్తూ ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. 2024 అక్టోబర్ నుంచి ఛైర్మన్ పోస్టు ఖాళీగా ఉందని, ఎపిఇఆర్‌సిలో సభ్యుడి పోస్టును భర్తీ చేసేందుకు ఈ ఏడాది జూన్‌లో నోటిఫికేషన్ వెలువడిందని న్యాయవాది చెప్పారు. ఛైర్మన్ పోస్టు భర్తీ ప్రస్తావన లేదన్నారు. దీనిపై ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ప్రణతి స్పందిస్తూ, ఎపిఇఆర్‌సి ఛైర్మన్‌గా జస్టిస్ నాగార్జునరెడ్డి పదవీ విరమణ చేశారని, ఆ తర్వాత ఇఆర్‌సి సభ్యుడు ఠాకూర్ రామ్ సింగ్ ఇన్‌ఛార్జి ఛైర్మన్‌గా వ్యవహరించారని, అయితే, గత ఫిబ్రవరిలో రామ్ సింగ్ పదవీ విరమణతో ఆ పోస్టు ఖాళీగా ఉందని వివరించారు.

# అంగన్వాడీ టీచర్ దాష్టీకం

(మొదటిపేజీ తరువాయి)

వేడివేడి గంజి మీద పడిపోవడంతో ఆమె ఎడమ చేతికి తీవ్ర గాయాలయ్యాయి దీంతో బుధవారం మధ్యాహ్నం జరిగిన సంఘటన సాయంత్రం వరకు ఎవరికీ తెలియ చేయకుండా ఐసిడిఎస్ అధికారులు గుట్టుగా ఉంచడం పై విమర్శలు వెలువెత్తుతున్నాయి. సాయంత్రం అఖిల తల్లిదండ్రులకు విషయం తెలిసి అంగన్వాడీ టీచర్ నిర్వాకాన్ని ఎండగట్టడానికి వెళితే ఆమె అక్కడ అందుబాటులో లేదని తెలిసింది.దీంతో వారు సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఐసిడిఎస్ అధికారి సిడిపీఓ కల్పన ను వివరణ కోరగా ఆమె బాలిక ఈ ఘటనలో గాయపడింది వాస్తవమని కానీ అంగన్వాడీ టీచర్ పొరపాటుతో ఇది జరిగిందని తెలిపారు.

## ట్రంప్ ప్రకటన రజతోత్సవానికి చేరుకున్నా..

# మౌనం వీడని ప్రధాని

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారని కాంగ్రెస్ పేర్కొంది. గత 73రోజుల్లో ట్రంప్ 25సార్లు బాకా ఉదారు కానీ ప్రధాని మౌనంగానే ఉన్నారని కాంగ్రెస్ కమ్యూనికేషన్ ప్రతినిధి జైరాం రమేష్ వ్యాఖ్యానించారు. ప్రధానికి విదేశాలకు వెళ్లేందుకు, స్వదేశంలో ప్రజాస్వామ్య సంస్థలను అస్థిరపరచడానికి మాత్రమే సమయం దొరుకుతుందని ఎద్దేవా చేశారు. భారత్, పాక్‌ల మధ్య ఇటీవల జరిగిన యుద్ధాన్ని తాను ఆపానని, ఈ యుద్ధంలో ఐదు విమానాలను కూల్చివేశామని ట్రంప్ మంగళవారం మరోసారి వెల్లడించారు. భారత్, పాకిస్తాన్‌ల మధ్య వివాదం బహుశా అణు యుద్ధంతో ముగిసి ఉండేదని కూడా అన్నారు. పార్లమెంట్‌లో పెహల్గాం-సిందూర్‌పై చర్చకు కచ్చితమైన తేదీలు ప్రకటించేందుకు ప్రధాని మోడీ నిరాకరిస్తూనే ఉన్నారు. చర్చలో ప్రధాని సమాధానానికి కట్టుబడి ఉండటానికి మోడీ ప్రభుత్వం నిరాకరిస్తూనే ఉండటంతో అమెరికా అధ్యక్షులు ట్రంప్ రజతోత్సవానికి చేరుకున్నారని, ఇది ఆయన వాదనలకు పావు శతాబ్దపు మార్క్ అని అన్నారు.

ఈ ఏడాది మే 10న, వాషింగ్టన్ మధ్యవర్తిత్వంలో జరిగిన సుదీర్ఘ చర్చల తర్వాత భారత్, పాకిస్తాన్ పూర్తి మరియు తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించాయని సోషల్ మీడియాలో ప్రకటించినప్పటి నుండి, భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలను పరిష్కరించేందుకు తాను సహాయం చేశారని ఆయన అనేక సందర్భాల్లో తన వాదనను పునరావృతం చేశారు.

## నారా లోకేశ్ చొరవతో...

# విశాఖకు పెట్టుబడుల వెల్లువ!

(మొదటిపేజీ తరువాయి)

బుధవారం జరిగిన 9వ ఎస్ఐపీబీ (స్టేట్ ఇన్వెస్టిమెంట్ ప్రమోషన్ బోర్డు) సమావేశంలో ఐటీ రంగంలో రూ.20,216 కోట్ల పెట్టుబడులు... 50,600 ఉద్యోగాలు కల్పించే నాలుగు భారీ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు.

గత ఏడాది కాలంలో మంత్రి లోకేశ్ చేస్తున్న కృషితో విశాఖ ఐటీ హబ్ గా రూపుదిద్దుకోనుంది. ఇటీవల మంత్రి లోకేశ్ బెంగుళూరు పర్యటన సందర్భంగా 35 వేల ఉద్యోగాలు కల్పించే రెండు ప్రముఖ సంస్థలతో ఒకేరోజు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఆ రెండు సంస్థలకు తాజాగా జరిగిన ఎస్ఐపీబీ సమావేశంలో పచ్చజెండా ఊపారు. ఆ రోజున ఎంఓయూలు కుదుర్చుకున్న సత్వ డెవలపర్స్ సంస్థ విశాఖ మధురవాడలో రూ.1500 కోట్ల పెట్టుబడులు, 2 5 వేల ఉద్యోగాలు.. ఏఎన్ఎస్ఆర్ సంస్థ రూ.1000 కోట్ల గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)ని ఏర్పాటుచేయడం ద్వారా 10 వేలమందికి ఉద్యోవగాశాలు కల్పించనుంది. అదేవిధంగా ఎస్ఐపీబీ ఆమోదించిన మరో ప్రముఖ సంస్థ సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్ విశాఖపట్నంలో డేటా సెంటర్ పై మొదటిదశలో రూ.1,466 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. దీనిద్వారా 200 మందికి ఉపాధి లభించనుంది. రెండవదశలో రూ.15,000 కోట్ల పెట్టుబడులు... 400 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి. ఇదిలావుండగా విశాఖ ఎండాడలో బీవీఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.1,250కోట్లతో వరల్డ్ ట్రేడ్ సెంటర్ ఏర్పాటు చేయబోతోంది. తాజా ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం పొందిన ఈ సంస్థ ద్వారా 15 వేల మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.

ప్రఖ్యాత ఐటీ సంస్థలైన టీసీఎస్ (12 వేల ఉద్యోగాలు), కాగ్నిజెంట్ (రూ.1,583కోట్ల పెట్టుబడి, 8 వేల ఉద్యోగాలు) త్వరలో విశాఖ కేంద్రంగా తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. గత ఏడాది కాలంగా మంత్రి లోకేశ్ అవిశ్రాంత కృషితో రాష్ట్రంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ), డేటాసెంటర్లపై లక్షకోట్లు పెట్టుబడులు పెట్టేందుకు, 95 ప్రముఖ సంస్థలు ముందుకు వచ్చాయి.

గత ఏడాది నవంబర్ లో లోకేశ్ చేసిన పెట్టుబడుల యాత్ర, జనవరిలో దావోస్ వేదికగా వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో జరిపిన చర్చలు ఫలవంతమై రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. ఐదేళ్లలో యువతకు 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని సాకారం చేసేందుకు... పెట్టుబడులు, ఉపాధి కల్పన సబ్ కమిటీ ఛైర్మన్ గా మంత్రి లోకేశ్ చేస్తున్న ప్రయత్నాలు సాకారమవుతున్నాయి.

# జింబాబ్వేలో ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

చితుంగ్విజా సమీపంలో మంగళవారం జరిగిన ఈ ప్రమాదంలో కొంతమంది పాదచారులతో సహా 17 మంది బాధితులు సంఘటనా స్థలంలోనే మరణించారని పోలీసు ప్రతినిధి పాల్ న్యాతి తెలిపారు. డ్రైవర్ నియంత్రణ కోల్పోయిన తర్వాత ట్రక్కు ఎదురుగా ఉన్న లేన్‌లోకి దూసుకెళ్లి మినీబస్సును ఢీకొట్టిందని న్యాతి చెప్పారు. ఢీకొనడానికి ముందు రహదారిపై నడుస్తున్న ఇద్దరు పాదచారులను ట్రక్కు ఢీకొట్టింది. మినీబస్సులోని 17 మంది ప్రయాణికులలో పదిహేను మంది అక్కడికక్కడే మరణించగా, మరికొందరు గాయపడ్డారు. చిటుంగ్విజా మేయర్ రోసారియా మాంగోమా ఈ ప్రమాదాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. దీనిని పట్టణం చూసిన "అత్యంత కలతపెట్టే మరియు బాధాకరమైన దృశ్యాలలో ఒకటి" అని అన్నారు. జింబాబ్వేలో ప్రజా రవాణాకు సంబంధించిన ఘోరమైన రోడ్డు ప్రమాదాలు సర్వసాధారణం. ఫిబ్రవరిలో, దక్షిణాఫ్రికా సరిహద్దులోని బీట్‌బ్రిడ్జ్ సమీపంలో బస్సు, ట్రక్కు ఢీకొన్న ప్రమాదంలో 24 మంది మరణించారు. దాదాపు 1.5 కోట్ల జనాభా ఉన్న జింబాబ్వేలో ప్రతి 15 నిమిషాలకు ఒక రోడ్డు ప్రమాదం నమోదవుతోంది. రోజుకు కనీసం ఐదుగురు మరణిస్తున్నారు. ఇది ఆఫ్రికాలో అత్యధిక మరణాల రేటులో ఒకటి అని జాతీయ గణాంకాల సంస్థ తెలిపింది.

# సంపాదకీయం

## ఇక డాలర్ టైమ్ అయిపోయిందా


బ్రిక్స్ దేశాలపై సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ మరో సారి హెచ్చరించారు. ఈ కూటమి కూడా తొందర్లోనే అంతమవుతుందని ట్రంప్ అన్నారు. బ్రిక్స్ దేశాలు అమెరికా డాలర్ ఆధిపత్యాన్ని తగ్గించేందుకు ప్రయత్నించాయని, అందుకే తాను ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ట్రంప్ శుక్రవారం వైట్‌హౌస్‌లో తెలిపారు.అయితే, ఈ సందర్భంగా ట్రంప్ ఏ దేశం పేరును ప్రత్యేకంగా ప్రస్తావించలేదుబ్రిక్స్ కూటమిలో కీలక దేశాలైన భారత్, రష్యా, చైనా తమ మధ్య త్రైపాక్షిక సంబంధాలను మెరుగుపరుచుకు నేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ట్రంప్ ఈ హెచ్చరికలు జారీ చేశారు.అంతకుముందు కూడా బ్రిక్స్ దేశాలపై సుంకాలు విధిస్తామంటూ ట్రంప్ హెచ్చరికలు చేశారు.భారత్, చైనా మధ్య సంబంధాలను తిరిగి గాడిలో పెట్టేందుకు రష్యా ప్రయత్నాలు చేస్తోంది. ప్రస్తుతం చైనా దీనికి సానుకూలంగా స్పందిస్తోంది.చైనా, రష్యా, భారత్ మధ్య త్రైపాక్షిక సంబంధాలు కేవలం మూడు దేశాలకు ప్రయోజనం చేకూర్చడమే కాకుండా.. ఈ ప్రాంతంలో, ప్రపంచంలో శాంతిని, భద్రతను, స్థిరత్వాన్ని, అభివృద్ధిని అందించేందుకు సాయం చేస్తుందని చైనా విదేశీ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ చెప్పారు.త్రైపాక్షిక సహకారాన్ని పెంపొందించుకోవడానికి రష్యా, భారత్‌లతో చర్చలు జరిపేందుకు చైనా సిద్ధంగా ఉందని లిన్ అన్నారు.రష్యా–భారత్–చైనా (ఆర్ఐసీ) ఫార్మాట్‌ను తిరిగి ప్రారంభించేందుకు భారత్, చైనాతో రష్యా చర్చలు జరుపుతోందని అంతకుముందు ఆ దేశ డిప్యూటీ ఫారిన్ మినిస్టర్ ఆంద్రీ రుడెంకో చెప్పారు.బ్రిక్స్ విషయం ప్రస్తావించిన ట్రంప్.. " బ్రిక్స్ అని పిలిచే ఒక చిన్న గ్రూప్ త్వరలోనే అంతం కాబోతుంది. డాలర్‌ను, డాలర్ ఆధిపత్యాన్ని, ప్రమాణాలను ఇది చేజిక్కించుకునేందుకు చూసింది" అన్నారు."బ్రిక్స్ గ్రూప్‌లోని అన్ని దేశాలపై మేం 10 శాతం సుంకాలను విధించనున్నామని చెప్పాను. ఆ తర్వాత రోజే వారు సమావేశం నిర్వహించారు. కానీ, ఎవరూ హాజరుకాలేదు" అని ట్రంప్ వెటకారంగా అన్నారు.ఆ తర్వాత ట్రంప్ మరోసారి డాలర్‌ను బలోపేతం చేయాలని, ప్రపంచ కరెన్సీగా దాన్ని ఉంచాలని నొక్కి చెప్పారు."మేం డాలర్‌ను పడిపోనీయం. ప్రపంచ కరెన్సీగా డాలర్ తన హోదాను కోల్పోతే, అది ప్రపంచ యుద్ధంలో ఓడిపోయిన మాదిరే అవుతుంది" అని తెలిపారు.'బ్రిక్స్ దేశాల కూటమి గురించి విన్నప్పుడు, నేను వారిపై కఠిన వైఖరిని అనుసరించాను. ఒకవేళ ఈ దేశాలు ఏకమైతే, త్వరలోనే ఈ గ్రూప్ అంతమవుతుంది" అని అన్నారు.ఈ ఏడాది జులై 6, 7 తేదీల్లో బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో బ్రిక్స్ 17వ సదస్సు జరిగింది. ఈ సదస్సు తర్వాత కూడా అదనంగా 10 శాతం సుంకాలను విధిస్తానని ట్రంప్ హెచ్చరించారు.'బ్రిక్స్‌కు చెందిన ఏ దేశమైనా అమెరికా వ్యతిరేక విధానాలతో ఉంటే అదనంగా 10 శాతం సుంకాలను ఎదుర్కోవాలి. ఈ సుంకాల విధింపులో ఎలాంటి మినహాయింపు ఇవ్వం" అని జులై 7న ఒక సోషల్ మీడియా పోస్టులో ట్రంప్ రాశారు.ప్రపంచ పాలనను మెరుగుపర్చడం', 'అంతర్జాతీయ సుస్థిరత'పై బ్రిక్స్ రియో డిక్లరేషన్‌లో చర్చించారు. దీంతో పాటు ఏకపక్ష సుంకాలు, సుంకాలు లేకపోవడంపైనా చర్చ జరిగింది.ఈ డిక్లరేషన్ మేనిఫెస్టోలో అమెరికా పేరును ప్రస్తావించలేదు.వాణిజ్య విధానాలను వక్రీకరించి, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) నిబంధనలను ఉల్లంఘించే ఏకపక్ష సుంకాలు, నాన్–టారిఫ్ చర్యల వినియోగంపై బ్రిక్స్ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయని రియో డిక్లరేషన్ పేర్కొంది.ఏకపక్ష బలవంతపు చర్యలు విధించడం అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించడం కిందకే వస్తుందని ఈ డిక్లరేషన్‌లో బ్రిక్స్ దేశాలు పేర్కొన్నాయి.ఏకపక్ష ఆర్థిక ఆంక్షలు వంటివి ప్రపంచంపై ప్రతికూల ప్రభావాలను చూపిస్తాయని తెలిపాయి.ఈ బ్రిక్స్ సదస్సులో డబ్ల్యూటీఓ నిబంధనలకు అనుగుణంగా వాణిజ్యాన్ని సమర్థిస్తూ, బహుళ పక్ష వాణిజ్య విధానం గురించి చర్చించినట్లు తెలిపింది.2020లో భారత్, చైనా దేశాలకు చెందిన సైనికుల మధ్య ఘర్షణ నెలకొనడంతో, ఈ రెండు దేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. ఆ తర్వాత ఆర్ఐసీ కోసం ఎలాంటి ప్రయత్నాలు జరగలేదు.ఆర్ఐసీ ఫార్మాట్‌ను తిరిగి ప్రారంభించడాన్ని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిశీలిస్తోందని జులై 17న భారత మీడియాలో కథనాలు వచ్చాయి. మూడు దేశాలకు అనువైన విధానంలోనే ఏదైనా నిర్ణయం తీసుకుంటారని ఆ కథనాలు పేర్కొన్నాయి.షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ)లో పాల్గొనేందుకు ఐదేళ్లలో తొలిసారి భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ చైనాకు వెళ్లిన సందర్భంగా.. ఆర్ఐసీ ఫార్మాట్‌పై చర్చలు జరిగాయి.

ఏకపక్షం, రక్షణవాదం, అధికార రాజకీయం, బెదిరింపులు ప్రపంచానికి తీవ్ర సవాళ్లను విసురుతున్నాయి" అని జులై 14న జైశంకర్‌తో భేటీ అయిన చైనా విదేశాంగ మంత్రి వాంగ్ లీ చెప్పారు.అందుకే, రెండు దేశాలు సామరస్యంగా జీవించేందుకు, ఒకదానికొకటి సాయపడుతూ విజయం సాధించే మార్గాలను అన్వేషించాలని అన్నారు.రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే అతిపెద్ద దేశాలు భారత్, చైనాలు.ఈ రెండు దేశాలు అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ విధించే అదనపు సుంకాల ముప్పు ముంగిట ఉన్నాయి. సుంకాలు విధిస్తామని 50 రోజుల్లో యుక్రెయిన్‌తో యుద్ధం ముగించేలా ఒప్పందానికి రావడానికి రష్యాపై ఒత్తిడి తీసుకు రానుంది అమెరికా.ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్–అమెరికా మధ్య సంబంధాలు క్షీణించాయని చైనా నిపుణులు అంటున్నారు.

చైనీస్ న్యూస్ అవుట్‌లెట్ గ్వాంచాలో జులై 13న రాసిన కథనంలో.. అమెరికా, భారత్ మధ్య కొనసాగుతోన్న వాణిజ్య సంక్షోభాన్ని ఫుడాన్ యూనివర్సిటీకి చెందిన ఝు చావో ప్రస్తావించారు.భారత్‌ను కట్టడి చేసేందుకు పాకిస్తాన్‌ను వాడుకోవడం, రెండు దేశాల మధ్య బలవంతంగా సయోధ్యను కుదర్చడం వంటి వ్యూహాన్ని అమెరికా అవలంభించిందని ఆయన అన్నారు.చైనాకు చెందిన ఇంటర్నేషనల్ స్కాలర్ ప్రొఫెసర్ జిన్ కాన్‌రాంగ్ కూడా ఇదే రకమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.భారత్–అమెరికా మధ్య సంబంధాలు క్షీణిస్తుండటంతో.. అమెరికా, పాకిస్తాన్ మధ్య సంబంధాలు ఇటీవల మరింత మెరుగుపడ్డాయని తెలిపారు.జూన్‌లో కెనడాలో జరిగిన జీ–7 సదస్సుకు హాజరయ్యేందుకు వెళ్లిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను కలవలేకపోయారని ప్రొఫెసర్ జిన్ అన్నారు.ఆ తర్వాత పాకిస్తానీ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ జనరల్ ఆసిమ్ మునీర్‌కు ట్రంప్ వైట్‌హౌస్‌లో ఆతిథ్యం ఇచ్చిన తర్వాత భారత్ మరింత అసంతృప్తి వ్యక్తం చేసింది.చైనా, రష్యాతో అమెరికా సంబంధాలు ఉద్రిక్తతంగా మారాయి. యుక్రెయిన్‌పై రష్యా దాడి చేసిన తర్వాత చైనా, రష్యాలు మరింత దగ్గరయ్యాయి.అమెరికా ఆధిపత్యంలోని ప్రపంచాన్ని తిరస్కరించి, బహుళ ధ్రువ ప్రపంచాన్ని అంటే పలు దేశాల మధ్య అధికారాన్ని పంపిణీ చేసే వ్యవస్థను సృష్టించాలని ఈ రెండు దేశాలు చర్చిస్తున్నాయి.అందుకే ప్రపంచంలో అమెరికా కరెన్సీ డాలర్ ఆధిపత్యాన్ని సవాలు చేసేందుకు రెండు దేశాలు చాలా కాలంగా ప్రయత్నిస్తున్నాయి.అమెరికా డాలర్‌తో కాకుండా చైనా కరెన్సీ యువాన్‌తో ఆసియా, ఆఫ్రికా, దక్షిణా అమెరికా దేశాలతో వాణిజ్యం చేయాలనుకుంటున్నట్లు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ 2023లో చెప్పారు.చైనా ఇప్పటికే రష్యాతో తన కరెన్సీ యువాన్‌తో ట్రేడ్ చేస్తోంది. రష్యా కూడా అదే చేస్తోంది. ఎందుకంటే, అమెరికా, పశ్చిమ దేశాలు రష్యాపై తీవ్ర ఆర్థిక ఆంక్షలు విధించాయి.అమెరికా, యూరోపియన్ యూనియన్, బ్రిటన్, వీటి మిత్ర దేశాలు చాలా అత్యంత ముఖ్యమైన అంతర్జాతీయ చెల్లింపు వ్యవస్థ స్విఫ్ట్ నుంచి రష్యన్ బ్యాంకులను నిషేధించాయి."బ్రిక్స్ దేశాలు ప్రత్యామ్నాయ కరెన్సీ కోసం ప్రయత్నిస్తున్నాయి. ఒకవేళ ప్రత్యామ్నాయ కరెన్సీని సృష్టించలేకపోతే, కనీసం ఫైనాన్సియల్ నెట్‌వర్క్‌నైనా సృష్టించాలని అనుకుంటున్నాయి" అని విదేశీ వ్యవహారాల నిపుణులు, 'ది ఇమేజ్ ఇండియా ఇనిస్టిట్యూట్' అధ్యక్షుడు రబీంద్ర సచ్‌దేవ్ చెప్పారు."స్విఫ్ట్ బ్యాంకింగ్ ఇంటర్నేషనల్ అమెరికా, యూరప్, పశ్చిమ దేశాల ఆధిపత్యంలో ఉంది. ఏదైనా దేశంపై ఆంక్షలు విధిస్తే, ఈ వ్యవస్థ నుంచి అది వైదొలుగుతుంది" అని రబీంద్ర చెప్పారు.' రష్యాపై విధించిన ఆంక్షలను చూస్తే, భవిష్యత్‌లో తమ బ్యాంకింగ్‌ను కూడా బ్లాక్ చేస్తాయేమోనని బ్రిక్స్ దేశాలు భయపడుతున్నాయి. అందుకే, ఫైనాన్సియల్ నెట్‌వర్క్‌ను సృష్టించేందుకు ఈ దేశాలు ప్రయత్నిస్తున్నాయి" అని సచ్‌దేవ్ తెలిపారు."బ్రిక్స్ దేశాలు అలాంటి దానికోసం చూస్తే, అది అంత త్వరగా జరగదు. అయితే, కొన్ని ప్రయత్నాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. బ్రెజిల్‌తో చైనా యువాన్‌లో ట్రేడ్ చేస్తోంది. కరెన్సీ విషయంలో సౌదీ అరేబియాతో చైనా ఒప్పందం కుదుర్చుకుంది. అలాగే, రష్యాతో కూడా అదే రకమైన ఒప్పందం చేసుకుంది" అని తెలిపారు.

# అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్

## -నేడు సర్ ఆర్థర్ కాటన్ వర్ధంతి




మానవ జాతి వికాసానికి సృష్టి అందించిన వరప్రసాదమే సర్ ఆర్థ్ కాటన్. మద్రాసు రాష్ట్రంలో వారు అమలు చేసిన నీటి పారుదల పనులు అద్వితీయమైన విజయాలు సాధించాయి. సర్ ఆర్థర్ కాటన్ దూరదృష్టి, సునిశిత మేధాశక్తి అమోఘం, అద్వితీయం. దక్షిణ భారతావనిలో ఎన్నో నీటి పారుదల రూపకల్పన చేసిన అన్న దాత.. సర్ ఆర్థర్ కాటన్ ను ప్రభుత్వం సముచితంగా అనేక బిరుదులతో సన్మానించింది.1803 మే 15వ తేది కాటన్ జన్మించారు. కుటుంబంలో అందరికంటే తల్లి వ్యక్తిత్వ ప్రభావం ఆయనపై పడింది. కాటన్ చిన్నతనం నుంచి మనో వికాసానికి సాహసానికి, ధైర్యానికి, దీక్షకు మారుపేరు. తల్లి ఇచ్చిన శిక్షణ కాటన్ కి ఎంతో ఉపక రించింది. 15 ఏళ్ళ ప్రాయంలో ఇండియాకు వెళ్ళడానికి స్కాలర్ షిప్ పొందారు. 1819 లో ఆర్థర్ కాటన్ జాగ్రత్తగా చదువుకొని మంచి క్రమశిక్షణతో మెలిగి అది స్కాంబి లో చక్కగా విద్యనభ్యసించి ఏ పరీక్షకు హాజరు కాకుండానే రాయల్ ఇంజనీర్ సర్టిఫికేట్ ఆధారంగా ఉద్యోగం సంపాదించారు. 1821 లో 18 సంవత్సరాల ప్రాయంలో ఇండియాలో ఉద్యోగంలో నియమింపబడ్డారు. 1822 సంవత్సరం లో అనేక జిల్లాల్లోని చెరువు మరమత్తు పనులను పర్యవేక్షించే పనిని అప్పగించారు. 1824 సంవత్సరం వరకు ఈవిధంగా పనిచేసి మద్రాసు దక్షిణాన కొన్ని మైళ్ళ దూరంతో వున్న మిలిటరీ స్థావరమైన థామస్ మౌంట్ దగ్గర భవనాలు నిర్మించడానికి నియమించబడిరి. ఎనిమిదేళ్ళ సర్వీసు అయిన తర్వాత కెప్టెన్ ర్యాంక్ కు ఎదగారు. ఆయల కృషి వల్ల తంజావూరు జిల్లాలోని అనే నిర్మాణపు పనులు పూర్తి అయి రాష్టంతో సంపన్న జిల్లా గా మారింది.1828 – 29 సంవత్సరాలలో అనేక ప్రణాళికలకు రూపకల్పన చేశారు. తరువాత అనారోగ్య కారణాలవల్ల ఇంగ్లాండు తిరిగి వెళ్ళనలసి వచ్చింది. 1832 లో తిరిగి ఉద్యోగంలో ప్రవేశించారు. శక్తికి మించిన శ్రమ చేయడం వల్ల తరచు అనారోగ్యానికి గురయ్యేవారు. ఈసారి ఆస్ట్రేలియాకు వెళ్ళవలసి వచ్చింది. అక్కడ వుండగా ఒక ధనవంతుని కుమార్తె ఎలిజబెత్ ని ప్రేమించి వివాహమాడారి. 1841 సంవత్సరం లో అక్టోబరు 10వ తేదీన వీరి వివాహం జరిగింది. తరువాత తిరిగి టాస్మోనియా వెళ్ళారు. ఆ సమయంలో రాజమండ్రి జిల్లా పరిస్తితి అద్వాహ్నంగా ఉండేది. గోదావరి తో పారే నీటిని వినియోగించి ఆ భూములను సస్యశ్యామలం చేయటం జరిగింది. అప్పటినుంచీ రాజమండ్రి జిల్లా గోదావరి జిల్లా గా పేరు గాంచింది. గోదావరి నదిపై 12 లక్షల ఎకరాల సాగుకు ఉపయోగపడే ఒక ఆనకట్ట నిర్మించబడింది. ఈ ఆనకట నిర్మాణం ద్వారా ఆయన కన్న కలలు నిజమయ్యాయి. కాల్వలు తరువాత కాల్వలు, పిల్లకాత్వతు, పంట కాల్వలు త్రవ్వడం జరిగింది. 1841 నుండి 45 ఏండ్లు నీటి పారుదల పథకాల అమలుకై ఆయన నిర్విరామ కృషి చేశారు. 1881లో ప్రచురించిన "వీలున్నచోట నీటి పారుదలకు కాల్వలను ఏర్పాటు చేయాలి. వర్షపు నీరు, బావి నీరు, ఇతర విధానాల ద్వారా లభించే నీటి కన్నా భూమిని సారవంతం చేసే ఎరువు గల్గిన నీటుని పొలాలలకు కాల్వుల దారా పారించవచ్చును. "ఒక చోటినుండి ఇంకొక చోటికి ఉత్పత్తులను కారు చౌక ఎగుమతి చేయడానికి నీటి కంటే మరొక ఉత్తమ సాధనం లేదు. ఆ కారణంగా నీటి పారుదల కాల్వలను స్టీమ్ బోట్ లు తిరగడానికి వాలుగా నౌకాయాన సౌకర్యాలు కల్పించారు. ధవళేశ్వరం ఆలకట్ట నిర్మాణంలో సర్ ఆర్థర్ కాటన్ చూపిన ప్రతి భాపాటవాలు నేటికి మరువలేనివి. ఈ బ్యారేజి నిర్మాణం వల్ల గోదావరి డెల్టాలో 13,75,000 టన్నులు, ధాన్యము, 16,38,000 చెరుకు, 34,000 టన్నుల పప్పు ధాన్యము, చిరుధాన్యాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ వ్యారేజి నిధిని 3.6. కి.మీ. దేశంతో కెల్ల అతి పెద్దదైల ధవళేశ్వరం బ్యారేజి సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజిగా పిలువ బడుతున్నది. ఇండియాలో పబ్లిక్ వర్క్స్ అనే పుస్తకాన్ని కూడా ఆయన రాసారు. మానవ జాతి మహోదయానికి ఇంజనీరుగా రచయితగా ఆలోచలా పరులుగా శ్రీ కాటన్ చేసిన కృషి చిరస్మరణీయమైంది. ఆయన పేదరిక నిర్మూలనకు కరువు నివారణకు అనేక నీటి పథకాలు అమలు చేసి చరిత్ర ప్రసిద్ధుడైయాడు. ఎన్ని పనులు చేసినా ఆయన సామాన్యుడే. ధర్మాన్ని నిర్వర్తించాడు. అభివృద్ధే ఆయన ఆదర్శం. అందుకే ఆయనను అన్నదాతగా పిలిచేవారు. ప్రజల హృదయాలలో శాశ్విత స్థానాన్ని ఏర్పరచుకొని 1899 జులై 24వ తేది పరమపదించారు.

## నవయుగ కవి చక్రవర్తి

# పద్మభూషణ్ గుర్రం జాషువా


## -నేడు గుర్రం జాషువా వర్ధంతి



ఒక అంటరాని వాడు, పవిత్రమైన హిందూ గ్రంథాలు, కావ్యాలు చదువుతున్నాడని ఇటు హిందూ ఛాందసులు కన్నెర్రజేస్తే, క్రైస్తవుడైవుండి హిందూ నాటకాలు రాసి హిందూమత ప్రచారానికి తోడ్పడు తున్నాడని క్రైస్తవ మతాధిపతుల ఆగ్రహానికి గురైన జాషువా 1895 సెప్టెంబరు 28 న, గుంటూరు జిల్లా వినుకొండలో జన్మించారు. తండ్రి వీరయ్యది యాదవ కులం, తల్లి లింగమ్మ క్రైస్తవ మతస్థురాలు. ఒక వంక దారిద్ర్యం, మరోవంక కుల మత పోటు. బాల్యం నుంచే జాషువా ఎన్నో అవమానాల్ని, అవహే ళనల్ని, ఛీత్కారాలను ఎదుర్కొన్నారు. చిన్నతనం నుంచే తిరగబడే తత్త్వంతో వీటన్నింటినీ అధిగ మించిన జాషువా, విద్యార్థి దశనుంచే వ్యంగచిత్రాలు గీయడం, గొల్లసుద్దులు పాడుకోవడం, ఇలా లలిత కళల పట్ల ఆసక్తి పెంచుకోవడం ప్రారంభించారు. దీపాల పిచ్చయ్యశాస్త్రి, జూపూడి హనుమచ్ఛాస్త్రి వంటి కొందరు జాషువా ఉన్నతికి తోడ్పడితే, మరికొందరు జాషువాను కులంపేరుతో తీవ్రంగా అవమానించారు. జీవితంలో ఎన్నోసార్లు, ఎన్నోచోట్ల జాషువా కవిత్వం విని ఆనందించిన వారు, కరతాళ ధ్వనులతో తమ హర్షాన్నిప్రకటించిన వారు, అతని కులం తెలుసుకొని అవమానించారని, జాషువా ఆవేదన పడినా,నిరుత్సాహంతో క్రుంగిపోక "కళకు కులమతాలున్నాయా?" అని ప్రశ్నిస్తూ, వాటిని ఆత్మ స్థైర్యంతో ఎదుర్కొని గొప్పకవిగా ఖ్యాతిని పొందారు. "విశ్వనరుడ నేను" అని సామాజిక వాస్తవికతను నిర్భయంగా చాటారు.' భారతవీరుడు' అనే పద్య కావ్యాన్ని, 'రుక్మిణీకళ్యాణం' అనే నాటకాన్ని, ఇక...ఫిరదౌసి, గబ్బిలం, నేతాజీ, బాపూజీ,,క్రీస్తు చరిత్ర, ముంతాజ్ మహల్(ఈ కావ్యాన్ని తాను అమితంగా ప్రేమించిన తన తల్లికి అంకితం ఇచ్చారు),శ్మశానవాటిక వంటి ఖండకావ్యాలు ఎన్నో రాసారు. మరెన్నో కవితా ఖండికలు అలనాటి ప్రముఖ సాహిత్య మాసపత్రిక 'భారతి 'లో వెలువరించారు. కవితావిశారద, కవికోకిల, కవిదిగ్గజ, నవయుగ కవిచక్రవర్తి,మధుర శ్రీనాథ లాంటి బిరుదులను సాహితీ ప్రియులు ప్రదానం చేస్తే, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, కేంద్ర సాహిత్య అకాడమీ, అవార్డులతో సత్కరించాయి. వీటన్నిటికీ మకుటాయమానంగా భారత ప్రభుత్వం 'పద్మభూషణ్ 'అవార్డుతో విశిష్ట పురస్కారాన్ని అందజేసింది."రాజు మరణించె, నొక తార రాలి పోయెకవియు మరణించె, నొక తార గగనమెక్కెరాజు జీవించే ఱాతి విగ్రహ ములందుసుకవి జీవించె ప్రజల నాలుకల యందు" అన్న జాషువా, ఆణి ముత్యా ల్లాంటి రచనలను తెలుగుజాతికి అందించిన జాషువా, 1971 జులై 24న గుంటూరులో కీర్తిశేషులయ్యారు.

# చంద్రబాబు అలా మారిపోయారే...

**తిరుపతి– సూర్య వాస్తవం**



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిజంగా గతం కంటే భిన్నంగా వ్యవహ రిస్తు న్నారు. గతంలోమూడు సార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన సమయంలో అంతా తానే అయి వ్యవహరించే వారు. ఆయన కూడా ఇతర రాజకీయ నేతల మాదిరిగానే వ్యవహరించే వారు. చంద్రబాబు పై ఒక అపవాదు కూడా ఉండేది. ఎక్కువగా అధికారులపైనే ఆధారపడి పాలన చేస్తారని. అధికారుల ఫీడ్ బ్యాక్ ప్రకారమే నడచుకుంటారనే వారు. నిజానికి అందులో నిజం లేకపోలేదు. 1995 లో ముఖ్యమంత్రిగా చంద్ర బాబు అయిన నాటి నుంచి 1999లో, 2014లో గాని అధికారులే చంద్రబాబు పాలనలో ఎక్కువగా పెత్తనం చెలాయించేవారు. ఎన్నికయిన ప్రజాప్రతినిధులు నామమాత్రంగా ఉండేవారు. ప్రజలు ఏమనుకుంటు న్నారన్న ఫీడ్ బ్యాక్ ను కూడా అధికారుల నుంచి తీసుకునే వారు. అందుకే తరచూ ఆయన గతంలో కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించేవారు. వారంలో ఒకరోజు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ రాష్ట్రంలో ప్రజల అభిప్రాయాలను తెలుసుకునే వారు. ఇటు జిల్లా కలెక్టర్లు, అటు ముఖ్య మంత్రి కార్యాలయం అధికారులు చెప్పిన మాటలనే చెవికి ఎక్కించు కునే వారు. క్షేత్ర స్థాయిలో తిరిగే నేతలను పెద్దగా పట్టించుకునే వారు కారు. వారితో సమావేశమ య్యేందు కు కూడా ఇష్టపడే వారు. వారికి సమయం కూడా కేటాయించే వారు కాదు. దీంతో తమకు కావాల్సిన పనులు చేయించుకోవ డానికి ముఖ్యమంత్రి కార్యాలయం పైనే ఎమ్మెల్యేలు, ఎంపీలు ఆధారపడే వారు. 2014లో రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కూడా అదే పరిస్థితి తలెత్తింది. అనేక మంది పార్టీ నుంచి వెళ్లిపోయిన ఎమ్మెల్యేలు తమను కలిసేందుకు కూడా చంద్రబాబు సమయం ఇచ్చేవారు కాదంటూ విమర్శలు చేశారు. కానీ 2024 ఎన్నికల తర్వాత చంద్రబాబు లో పెను మార్పు కనిపి స్తుంది. తరచూ ఎమ్మెల్యేలతో సమావేశమవు తున్నారు. పార్టీ ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి చంద్ర బాబు వరస భేటీలు జరుపుతున్నారు. ఈరోజు నరస రావుపేట, పాతపట్నం ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశం కానున్నారు. రోజువారీ షెడ్యూల్లో ఎంత బిజీగా ఉన్నప్పటికీ రోజుకు ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి సమావేశమవు తున్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటు న్నారు. .. ఇప్పటివరకు పద్దెనిమిది మంది ఎమ్మెల్యే లతో ముఖ్యమంత్రి సమావేశమ య్యారు. పార్టీ బలోపేతం, నియోజకవర్గంలో సమస్యలు–పరిష్కారాలు, పార్టీ పదవులపై వంటి ప్రధాన అంశాలు అజెండాగా భేటీ జరగనుంది. నియోజక వర్గాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం జరుగుతున్న తీరు, ప్రజల నుంచి అందుతున్న ఫిర్యా దులను కూడా అడిగి తెలుసు కుంటున్నారు. అదే సమయంలో జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడు ఖచ్చి తంగా కార్యకర్తలతో సమావేశం అవుతున్నారు. కార్య కర్తలతో ముఖాముఖి కార్యక్రమా లను నిర్వహిస్తు న్నారు. వారికి అండగా నిలబడతానని భరోసా ఇస్తున్నారు. మరొకవైపు లోకేశ్ కూడా కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తుండంతో 2024 తర్వాత చంద్రబాబు పాలనలో పెనుమార్పులు జరిగినట్లు కనపడుతుంది.

## పిసిపిఎన్‌డిటి చట్టం

# సమర్ధవంతంగా అమలు చేయాలి

### - డిప్యూటీ హెచ్‌ఈఓలతో డిఎమ్‌హెచ్ఓ డాక్టర్ లక్ష్మీ నరసయ్య సమీక్ష



**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం, జూలై 23:** గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం1994 (ఎసి పిఎన్ డి టి) అమలు పై జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డాక్టర్ లక్ష్మీ నరసయ్య అన్నమయ్య జిల్లా రాయచోటిలోని జిల్లా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ తో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. రాష్ట్ర అదనపు సంచాలకుల ఆదేశాల మేరకు జిల్లాలో పి సి పిఎన్ డి టి చట్టం సమర్ధవంతంగా అమలు చెయ్యాలని, జిల్లా లో ఆడ పిల్లల లింగ నిష్పత్తి పెరిగేలా కృషి చేయాలని ఇందుకోసం డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ అందరు ఈ చట్టం పై విస్రుతంగా అవగాహనా సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలన్నారు. జిల్లా లోని అన్ని స్కాన్ సెంటర్స్ పై నిఘా ఉంచి డెకొయ్ ఆపరేషన్స్ నిర్వహించి లింగ నిర్ధారణ చేయు స్కాన్ సెంటర్స్ ను గుర్తించి పై అధికారుల దృష్టికి తేవాళన్నారు. మిషన్ వత్సల్య పథకం పై ప్రజల్లో అవగాహన తేవాళన్నారు. తల్లితండ్రులు లేని అనాధ పిల్లలకు నెలకు రు 4000 కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారి ఖాతాలో 18సంవత్సరాల వయసు వచ్చు వరకు జమ చేస్తారని అన్నారు. అలాంటి వారిని గుర్తించి మిషన్ వత్సల్య పథకం కింద లబ్ది పొందేలా చూడాలన్నారు.. 104 సంచార వైద్య శిబిరాల దగ్గర, పాఠశాలల్లో, స్వయం సహాయక బృంద సభ్యులకు అవగాహనా సమావేశాలు నిర్వహించాలన్నారు. పి.సి.పి.ఎన్.డిటి ప్రోగ్రామ్ ఆఫీసర్ దేవ శిరోమణి మాట్లాడుచు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ అందరు అన్ని ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలాలు, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలలో పిసిపిఎన్‌డిటి చట్టంపై విద్యార్థులకు అవగా హనా సమావేశాలు నిర్వహించాలన్నారు. దినపత్రికలలో వచ్చే ప్రతికూల వార్తలకు ఆలస్యం లేకుండా స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి డాక్టర్ రియాజ్ బేగ్ జిల్లా లోని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

# స్పేస్ ఎక్స్‌పోను విద్యార్థులు వినియోగించుకోవాలి

### - విద్యార్థినీ విద్యార్థులు మరిన్ని ఆవిష్కరణలను చేయగలగాలి
### - జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి




**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, జూలై 23:** స్పేస్ ఎక్స్‌పోను వినియోగించుకొని విద్యార్థినీ విద్యార్థులు మరిన్ని ఆవిష్కరణలను చేయగలగాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. బుధవారం ఉదయం రాజంపేట లోని రైల్వే స్టేషన్ రోడ్డు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో.... అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి స్పేస్ సిటీ సీఈవో కేశినేని వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా పాల్గొని స్పేస్ ఎడ్యుకేషన్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... విద్యార్థి దశలో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన స్పేస్ ఎడ్యుకేషన్ ఎక్స్పో కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఉపగ్రహాలు డ్రోన్స్ వంటి పరికరాలను విద్యార్థినీ విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు.

ఇటువంటి పరికరాల మీద ఆసక్తిని పెంపొందించుకుంటే భవిష్యత్తులో భారతదేశానికి ఉపయోగపడే విధంగా ఎన్నో ఆవిష్కరణలను చేయొచ్చన్నారు. మన భారత దేశం... రష్యా చైనా అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడగలుగుతోందంటే దానికి కారణం ప్రభుత్వ పాఠశాలలో చదివిన వ్యక్తులే నని అన్నమయ్య జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులలో కూడా ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. స్వామి వివేకానంద అబ్దుల్ కలాం లాంటి వాళ్ళు చెప్పిన విధంగా పట్టుదల కలలుగనే స్వభావం ఉంటే ఎంత క్లిష్ట మైన లక్ష్యాలనయినా చేరుకోవచ్చునన్నారు. గరుత్మంతుడి కథలో చిన్న పక్షికి ఉన్న పట్టుదల మనకు ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రోన్ టెక్నాలజీని వ్యవసాయానికి, వరదలు వచ్చిన ప్రాంతా లలో ఆహారం సరఫరా చేయడానికి వినియోగిస్తోందన్నారు. ఇటువంటి టెక్నాలజీలను మరింత ముందుకు తీసుకెళ్లాలని విద్యార్థులకు సూచించారు. స్పేస్ సిటీ సీఈవో కేశినేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థినీ విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తిని పెంచడానికి ఎన్నో కార్య క్రమాలు రూపొందించిందని అటువంటి కార్యక్రమాలను వినియోగించుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముస్కాన్ చీఫ్ ఆపరేటింగ్ మేనేజర్ ప్రనీష్ రాజంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ నాగమణి, రాజంపేట తాసిల్దార్ పీర్ మున్ని, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో నైపుణ్యాలను

# వెలికితీయడమే ఉపాధ్యాయుల ప్రథమ కర్తవ్యం

### - డైట్ ప్రిన్సిపాల్ అజయ్ కుమార్ బాబు




**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, జూలై 23:** రాయచోటి డైట్‌లో ఇంగ్లీష్ క్లబ్ ప్రారంభం.రాయచోటి, డైట్ రాయచోటిలో ఏర్పాటు చేసిన "ఇంగ్లీష్ క్లబ్" నేడు ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమం విద్యార్థుల భాషా నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు, ఇంగ్లీష్ సాహిత్యం, కమ్యూనికేషన్, సాంస్కృతిక పరి జ్ఞానాన్ని అభివృద్ధి చేసేందుకు ఒక ముఖ్యమైన వేదికగా నిలవనుంది అని డైట్ ఇంగ్లీష్ లెక్చరర్ తిరుపతి శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రారంభ ప్రసంగంలో ప్రిన్సిపల్, అజయ్ కుమార్ బాబు, ఇంగ్లీష్ భాష ప్రాముఖ్యతను వివరించారు. ఇది ప్రపంచవ్యాప్తంగా కమ్యూనికేషన్ కోసం అత్యంత అవసరమైన భాష అని పేర్కొంటూ, విద్యార్థులు ఈ క్లబ్ ద్వారా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ విద్యావేత్త, సార్వత్రిక విద్య జిల్లా సమ న్వయ కర్త అయిన కొండూరు శ్రీనివాస రాజు మాట్లాడుతూ... ఇంగ్లీష్ భాష ఒక మహత్తర శక్తి అని, భిన్న సంస్కృతుల మధ్య వారధిగా ప్రపంచాన్ని కలిపే పాత్ర వహిస్తుందని చెప్పారు. విద్యార్థులు ఎప్పుడూ ఆసక్తిగా నేర్చుకోవాలని, క్లబ్ అందించే అవకా శాలను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు.ఈ ఇంగ్లీష్ క్లబ్ ద్వారా విద్యార్థులకు డిబేట్లు, చర్చలు, కవితా పఠనలు, ప్రదర్శనలు, వర్క్‌షాపులు వంటి కార్యక్రమాలు అందించ బడతాయి. ఇవి విద్యా ర్థుల సృజనాత్మకతను ప్రేరేపించి, కమ్యూనికేషన్ నైపుణ్యాలను అభివృద్ధి చేస్తాయి అని లెక్చరర్ తిరుపతి శ్రీనివాసులు పేర్కొన్నారు.

ఈ క్లబ్ ప్రత్యేకత ఏమంటే ఇది " సామూహిక అభ్యాసాన్ని" ప్రోత్సహిస్తుంది. అన్ని వర్గాల విద్యార్థులు ఇందులో చేరేలా రూపొందించబడింది. అంతేకాక, క్లాస్‌రూమ్ పరిమితిని మించి, ఇతర పాఠశాలలతో పోటీలు, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు కూడా నిర్వహిం చనున్నాయి.. విద్యార్థినీ విద్యార్థుల మాట్లాడుతూ... ఈ క్లబ్ ద్వారా తాము కొత్త విషయాలు నేర్చుకోగలమని, భవిష్యత్తులో ఇది ఎంతో ఉపయోగపడుతుందన్న నమ్మకాన్ని వారు వ్యక్తం చేశారు.ఇంగ్లీష్ క్లబ్ డైట్ రాయచోటికి ఒక కొత్త శక్తిని తెచ్చి పెడుతుందని అని ఇది భాషలో ప్రవీణతతో పాటు ప్రపంచస్థాయికి విద్యార్థుల అభ్యున్నతికి అవకాశం కల్పించనుంది అని కార్యక్రమంలో వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో డైట్ లెక్చరర్స్ వెంకట సుబ్బారెడ్డి, శివభాస్కర్, రెడ్డప్ప రెడ్డి, మోహన్ నాయక్, శివప్రసాద్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## మానవత్వం చాటుకున్న పామిడి సీఐ

**పామిడి - సూర్య వాస్తవం, జూలై 23:** సాధారణంగా ఖాకీ దుస్తులు ధరించిన పోలీసులు కఠినంగా ఉంటారని అనుకుంటారు. కానీ నిజానికి వారు కూడా మానవత్వంతో ఉంటారని, అవసరమైనప్పుడు సహాయం చేస్తారని పలు సందర్భాల్లో నిరూపితమైంది. అసలు వివరాల్లోకి వెళితే......రోడ్డుమీద బిక్షాటన చేస్తూ స్పృహ తప్పి పడిపోయిన వృద్ధురాలని పామిడి సీఐ యుగంధర్ నిస్సహాయ స్థితిలో ఉన్న ఆమెను చూసి చలించి తనే స్వయంగా ఆమెకు సహాయక చర్యలు చేసి పామిడి ప్రభుత్వాసుపత్రి కి చికిత్స నిమిత్తం అడ్మిట్ చేశారు. పామిడి సిబ్బంది పీసీ రవీంద్ర డ్రైవర్ క్రాంతి తేజ, హెూంగార్డు ఆదినారాయణ పాల్గొన్నారు.

## జీరో పావర్టీ పి4పై వార్డుల వారీగా సభలు



**గుత్తి -సూర్య వాస్తవం, జులై 23:** గుత్తి జీరో పావర్టీ పి4లో భాగంగా బుధవారం ఉదయం 11.30 నుండి మధ్యాహ్నం 12.30 వరకు సచివాలయం 12-స్వీపర్స్‌లో, మధ్యాహ్నం 2.00 నుండి 3.30 వరకు సచివాలయం.5 కొత్తూర్ కాలనీలలో బంగారు కుటుంబముల సమక్షంలో వార్డు సభ నిర్వహించడమైనది. ఇందులో జీరో పావర్టీ పి4కు సంబంధించి ఉద్దేశ్యము, కుటుంబాల ఎంపిక, మార్గ దర్శుల అడాప్షన్ గురించి మునిసిపల్ కమీషనర్ బి. జబ్బార్ మియా వివరించారు. సభలో రీవాలిడేషన్ ప్రక్రియ కూడా చేపట్టడమైనదని కమీషనర్ బి.జబ్బార్ మియా తెలిపారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ రాంబాబు,సి.ఓలు చంద్రశేఖర్ ప్రసన్నబాబు, సచివాలయ సిబ్బంది,మెప్మా ఆర్.పిలు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై నోటీసులు జారీ చేస్తా

### - తహసీల్దార్ ఆకుల తిరుమల బాబు



**సిద్దవటం - సూర్యవాస్తవం, జూలై 23:** ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేస్తామని సిద్దవటం తహసీల్దార్ ఆకుల తిరుమల బాబు హెచ్చరించారు. మండలంలోని ఉప్పరపల్లి, మాధవరం 1,2,3 వార్డు గ్రామ పంచాయతీలలోని ప్రభుత్వ స్థలాలను బుధవారం తహసీల్దార్ ఆకుల తిరుమల బాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను అన్యాక్రాంతం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మాధవరం 1,2,3 వార్డు పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం జరుగుతున్నట్లు సమాచారం రావడంతో పరిశీలించడం జరిగిందన్నారు. రెవిన్యూ శాఖ నుంచి ఎలాంటి అనుమతి పొందకుండా కొందరు ఆక్రమణలకు పాల్పడి నిర్మాణాలు చేపట్టినట్లు తమ దృష్టికి వచ్చిందని వారికి త్వరలో నోటీసులు జారీ చేస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, విఆర్ఏ పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల ఆద్యుడు చంద్రబాబు

### - మాజీ జెడ్పీటీసీ బేటప్ప నాయుడు

**గుడుపల్లి- సూర్య వాస్తవం, జూలై 23 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో సంక్షేమ పథకాల అమలు చేసిన ముఖ్యమంత్రుల జాబితాలో తొలి వరుసలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉంటారని గుడుపల్లి మండల మాజీ జెడ్పీటీసీ, క్లస్టర్ ఇంచార్జ్ బేటప్ప నాయుడు అన్నారు. బుధవారం గుడిపల్లి మండలం 128వ బూత్‌లో ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు చేపడుతున్న సంక్షేమ పథ కాలు, అభివృద్ధి గురించి సుపరిపాలన తొలి అడుగు కార్య క్రమంలో భాగంగా ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇలాంటి ప్రభుత్వం మరో ఒక 50 సంవత్సరాలు ఉండాలని మన ఆంధ్ర రాష్ట్రం చాలా అభివృద్ధి జరగాలని మనసారా కోరుకుంటున్నామని ప్రజలు చెప్పారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గుడిపల్లి మండల గ్రామ పంచాయతీ పార్టీ ప్రెసిడెంట్ మంజునాథ్, నేతలు సుబ్బన్న, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.



## కూటమి ప్రభుత్వం ప్రజల పక్షం

**- వైసీపీ పాలనలో రాష్ట్రం ధ్వంసం**
**- టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా**



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, జూలై 23:** కూటమి ప్రభుత్వం ప్రజల పక్షమని గత వైసిపి పాలనలో రాష్ట్రం ధ్వంసమైందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి,కుప్పం నియోజకవర్గ పరిశీలకులు గాజుల ఖాదర్ బాషా అన్నారు. బుధవారం అయన రాయచోటి పట్టణంలోని చర్చి వీధిలో సుపరిపాలన-తొలి అడుగు, ఇంటింటికి టిడిపి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ప్రతి ఒక్కరు ఆనందం వ్యక్తం చేస్తున్నారని వైసిపి కార్యకర్తలు సైతం ప్రభుత్వ పథకాలు మాకు అందుతున్నాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.కూటమి ప్రభుత్వంపై కొంత మంది మాత్రమే దుష్ప్రచారం చేస్తున్నారని, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని,ఏదో రకంగా బురద చల్లాలని ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఆగస్టు 15వ తేదీ నుండి మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు కూడా జారీ చేశారని తెలిపారు.రాష్ట్రంలో ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఎంతో సౌకర్యముతో ఏసీ ఎలక్ట్రానిక్ బస్సుల్లో ప్రయాణం చేసేందుకు ఇకపై ఏసీ ఎలక్ట్రానిక్ బస్సులు మాత్రమే కొనుగోలు చేయాలని చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు.రాయచోటి నియోజకవర్గంలో ఏ సమస్య ఉన్నా కూడా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకుని రావాలని,అప్పుడే ఆ సమస్యను పరిష్కారం చేస్తారని తెలిపారు.మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇంచార్జ్ మరియు మాజీ వీరభద్రస్వామి టెంపుల్ చైర్మన్ ఎద్దుల లక్ష్మీప్రసాద్ తెలుగుదేశం పార్టీ నాయకులు తాహిర్ బసిరెడ్డి కృష్ణయ్య నాగేంద్ర రెడ్డి రోఫా అమీర్ భాష హైదర్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బాల గంగాధర్ తిలక్, చంద్ర శేఖర్ ఆజాద్ జయంతి వేడుకలు




**గుత్తి - సూర్య వాస్తవం, జులై 23:** గుత్తి పట్టణంలోని ఫుట్బాల్ గ్రౌండ్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభు త్వ పెన్షనర్ల భవనంలో పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అబూ బాకర్,అదనపు కార్యదర్శి జెన్నే కుల్లాయి బాబు ఆధ్వర్యంలో బాలగంగాధర్ తిలక్, చంద్ర శేఖర్ ఆ జాద్ జయంతిని ఘనంగా నిర్వ హించారు. ముందుగా ఈ కార్యక్ర మంలో బాలగంగాధర్ తిలక్ చంద్రశేఖర్ ఆజాద్ చిత్ర పటాలకు అ సోసి యేట్ ప్రెసిడెంట్ స్వర్ణాంబ అదనపు కార్యదర్శి జెన్నే కుల్లాయి బాబు పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ జాతీ యోద్యమ పితగా తెచ్చుకున్న బాలగం గాధర్ తిలక్ మహారాష్ట్రకు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు. వీరు స్వరాజ్యం నాజ న్మ హక్కు,నేను దాన్ని పొంది తీ రుతాను అని నినదించారు.మరి చంద్ర శేఖర్ ఆజాద్ దేశం గర్వించ దగ్గ ఈయన అసలు పేరు చంద్ర శేఖర్ సీతారామతి వారి. బ్రిటిష్ వారి గుండెల్లో రైళ్ళు పరిగెత్తించి దేశ స్వాతంత్ర్యము కోసం సా యుధ పోరాటం చేసిన వీరుడు 1928లో బ్రిటిష్ పోలీసుల దాడి లో తీవ్రంగా గాయపడి మరణించి న పంజాబ్ కేసరి లాలాలజపతి రాయ్ మృతి కి ప్రతీకారంగా రాజ్ గురు, భగత్ సింగ్లు బ్రిటిష్ పోలీ స్ అధికారిని కాల్చిచంపగా, అధికారితో వచ్చిన మరొకహెడ్ కానిస్టేబుల్ ర్యాన్డ్ ను ఆజాద్ కాల్చి చంపారు అని అదనపు కార్యదర్శి జెన్నే కుల్లాయిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ అబూబాకర్,అసోసియేట్ ప్రెసి డెంట్ స్వర్ణాంబ, అదనపు కార్యదర్శి జెన్నే కుల్లాయిబాబు, నారాయణరెడ్డి, హస్సన్ అహమ్మద్, మద్దులేటి, శామ్యూల్, దేవదాస్, నరసింహులు మొదలగువారు పాల్గొన్నారు.

## సమాచార హక్కు.. సామాన్యుడి ఆయుధం

**-వ్యవసాయ అధికారి జగదీష్ బాబు**
**- సమాచార హక్కుచట్టం 2005పై అవగాహన**



**కనేకల్ - సూర్య వాస్తవం, జూలై 23 :** సమాచార హక్కు సామాన్యుడికి ఆయుధం అని అన్నారు కనేకల్ మండల వ్యవసాయ అధికారి జగదీష్ బాబు.సమాచార హక్కు చట్టం 2005 పై కనేకల్ మండలంలో ఉడేగోళం మరియు బ్రహ్మసముద్రం రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి జగదీష్ బాబు బుధవారం అవగాహన కల్పించారు. రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అధికారుల్లో పారదర్శకత, జవాబుదారితనం తీసుకురావడానికి సమాచార హక్కు చట్టం రూపొందించడం జరిగిందన్నారు. సమాచా రాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు, పౌరులకు వున్న హక్కును చట్టబద్ధం చేయడానికి కేంద్ర సమాచార కమీషనర్, రాష్ట్ర సమాచార కమీషన్ నెలకొల్పారని పేర్కొన్నారు. పౌరుడు అడిగిన సమాచారాన్ని 30 రోజుల్లోపు ఇవ్వాల్సి వుంటుందన్నారు. అనంతరం వ్యవసాయశాఖలో అమలవుతున్న పథకాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జగదీష్ బాబు, యం. పీ. ఈ.ఓ గంగ భవాని, జ్యోతి ఆయా గ్రామ ప్రజలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో**

# పాలిటెక్నిక్ విద్యార్థులకు ఓరియెంటేషన్

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, జూలై 23:** అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో( అటానమస్ ) బుధవారం మొదటి సంవత్సరం పాలిటెక్నిక్ విద్యార్థినీ విద్యార్థుల కోసం ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే క్రమశిక్షణ, అంకితభావం కలిగి ఉంటేనే విజయం సాధించడం సాధ్యమవుతుందన్నారు. తరగతి గదిలో నేర్చుకునే పాఠాలను ప్రయోగ శాలలో సాక్షా త్కారంగా అర్థం చేసుకొని, కమ్యూనికేషన్ స్మార్ట్ స్కిల్స్ లో నైపుణ్యం సంపాదించి, తాము ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. పదోతరగతి అనంతరం విద్యార్థులు తీసుకునే ప్రతి నిర్ణయం వారి భవిష్యత్తును నిర్ణయిస్తుందని అన్నారు. పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు చిన్న వయస్సులోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ పడే అర్హతను పొందగలుగుతారని తెలిపారు.కేంద్ర ప్రభుత్వ సంస్థలైన రైల్వే, ఆర్మీ, గెయిల్, ఓఎన్జిసి, డీఆర్డీఓ, బెల్, మహారత్న, నవరత్న సంస్థలు, అలాగే రాష్ట్ర ప్రభుత్వ శాఖలైన రోడ్డు - బిల్డింగ్స్, పంచాయతీ, ఇరిగేషన్, మున్సిపాలిటీ తదితర శాఖలలో



ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని వివరించారు. అదనంగా ప్రైవేట్ రంగాలలో కూడా కన్స్ట్రక్షన్, ఆటోమొబైల్స్, పవర్ ప్లాంట్స్, మ్యాను ఫ్యాక్చరింగ్, కమ్యూనికేషన్స్ వంటి విభాగాలలో అనేక అవకాశాలు ఉన్నాయని తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ హీరా రాజపుత్ మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ, సమయాన్ని సద్వి నియోగం చేసుకుంటూ అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి.వెంకటరమణ మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల అనేక గ్రామీణ విద్యార్థులకు సాంకేతిక విద్య అందిస్తూ వారి జీవితాలలో వెలుగులు నింపిందని ప్రశంసించారు.పాలిటెక్నిక్ కళాశాల ఇంచార్జ్ వి. మాట్లాడుతూ కళాశాల నుండి రాయచోటి పరిసర మండల కేంద్రాలకు బస్సు సౌకర్యాన్ని కల్పించడంతో పాటు, విద్యార్థులకు అవసరమైన అర్థమెటిక్, రీజనింగ్ మరియు కమ్యూనికేషన్ స్కిల్స్ పై ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆధునిక డిజిటల్ లైబ్రరీ, బాల బాలికలకోసం ప్రత్యేక హాస్టల్ వసతులు కూడా కళాశాలలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమం విద్యార్థులకు మార్గనిర్దేశకంగా నిలిచింది.



# రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది

**- రైతు ఇంట్లో పాలేరులా పనిచేస్తా!**
**- చివరి ఆయకట్టుకు నీరందే విధంగా చూస్తా!**
**- రైతు కష్టాల్లో తోడుగా నిలుస్తా**
**- కాలువ శ్రీనివాసులు**



**కనేకల్ - సూర్య వాస్తవం, జూలై 23 :** కనేకల్ చెరువు వద్ద బుధవారం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు జలహారతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కనేకల్లు మండలంలో హెచ్ ఎల్ సి కింద ఎక్కువ విస్తీర్ణంలో ఆయకట్టు సాగుతోందన్నారు. ఈ ఏడాది రైతులందరూ సక్రమంగా పంటలు పండించుకోవాలని, దానికి అనుగుణంగా నీటి సరఫరాకు అధికారులు తగిన ఏర్పాటు చేయాలని ఆదేశించామన్నారు. చివరి ఆయ కట్టుకు సక్రమంగా నీరందే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. రైతులకు దశాబ్దాల కాలంగా సేవలందిస్తున్న తుంగభద్ర ఎగువ కాలువ పరిస్థితి నానాటికి తీసికట్టుగా మారిందని ఆందోళన వ్యక్తపరిచారు. రైతు కష్టాలు ప్రభుత్వంతో వివరించి అత్యవసర మరమ్మతు పనుల కోసం రూ.35 కోట్లతో కాలువ లైనింగ్, బ్రిడ్జిలు, యు.టి.ల నిర్మాణాలు పూర్తి చేయగలిగామన్నారు. ఈ ప్రాంతంలో నాణ్యమైన ధాన్యం పంట పండిస్తుండటంతో పొరుగునున్న కర్ణాటక రాష్ట్రంలో కూడా ఎక్కువ ధరలకు బియ్యం అమ్ముడు పోతున్నాయన్నారు. ఒక పాలేరులాగా రైతుల ఇంట్లో వాళ్లకు అందుబాటులో ఉంటానని, వాళ్ళ కష్టాల్లో, సంతోషాల్లో తోడుగా నిలుస్తానని తెలియచేశారు. రైతుకు ఏ కష్టం రాకుండా చూసుకొనే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లాలేప్ప, ఫక్రుద్దీన్ సాబ్, ఆనంద రాజు, ఆది, రమేష్, చాంద్, హనుమంత రెడ్డి,వన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# జగన్ జీవితంలో ముఖ్యమంత్రి కాలేడు

**- ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి**

**ప్యాపిలి - సూర్య వాస్తవం, జూలై 23 :** జగన్ ఇక జీవితంలో ముఖ్యమంత్రి కాలేడని డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం ప్యాపిలి మండలపరిధి లోని చిన్న పూజర్ల, పెద్ద పూజర్ల గ్రామాల తోపాటు, పట్టణంలోని బిసి కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకిచ్చి ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రెండు నెలల్లో ఇంటింటికి తాగునీరు అందిస్తామని , రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అప్పటి వైసిపి ప్రభుత్వం చిన్నాభిన్నం చేసినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన అపార అనుభవంతో సంపద సృష్టిస్తూ ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చుతున్నారని, ఇది ఓర్వలేని వైసిపి నాయకులు తమ ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమాలు చేస్తున్నారని ప్రజలు అన్నీ గమనిస్తున్నారని



ఆ 11 సీట్లు కూడా వైసీపీకి ఎందుకు ఇచ్చామా అని బాధపడుతున్నారన్నారు. పెద్ద పూజర్ల గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు గడ్డం ప్రసాద్ రెడ్డి తమ గ్రామం లో 15 మందికి సీఎం సహాయ నిధి కింద 12.50 లక్షల రూపాయలు నిధులు విడుదల చేసి సీఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి రికార్డు సృష్టించారన్నారు. చిన్న పూజర్ల గ్రామానికి చెందిన పుల్లాసి దస్తగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రహరీ గోడను నిర్మించాలని, అలాగే విద్యార్థులకు పాఠశాలలో మరుగుదొడ్లను నిర్మించాలని కోరారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం చిన్న పూజర్ల గ్రామంలోని ఉన్నత, జిల్లా పరిషత్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో డీసీఎంఎస్ చైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్, మాజీ ఎంపీపీ తోప్పెల శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ యాదవ్, ప్యాపిలి టిడిపి ఇన్చార్జ్ ప్రభాకర్ రెడ్డి, గడ్డం అంకిరెడ్డి, ఖాజా పీర్,రాజా నారాయణ మూర్తి, రామ్మోహన్ యాదవ్, నడిగడ్డ నాగేంద్ర, చల్లా వీరా, విష్ణువర్ధన్ రెడ్డి, శివ, రాజు, మహేష్, సంజీవ్ రెడ్డి, హొసూరు రంగారెడ్డి, అలెబాద్ పరమేష్, సత్యం, తదితర టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## మోసపూరిత హామీలతో

# ప్రజలను మభ్యపెట్టడంలో బాబు దిట్ట

**- నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి**



**చెన్నూరు - సూర్య వాస్తవం, జూలై 23:** నారా చంద్రబాబు నాయుడు అసత్యాలు, అబద్ధాలు, మోసపూరిత వాగ్దానాలతో గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలను మభ్య పెట్టడం జరిగిందని ప్రజలు ఆయనను నమ్మి అధికారం కట్టబెడితే అధికారంలోకి రావడం ఆయన పద్ధతిలో ప్రజలకు మొండి చేయి చూపడం షరా మామూలేనని కమలాపురం నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నరేన్ రామాంజుల రెడ్డి తెలిపారు. మండలంలోని కొండపేట గ్రామంలో బుధవారం ఆయన బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు ఏవైతే 150 కి పైగా హామీలు ప్రజలకు ఇచ్చారో, అధికారంలోకి రాగానే హామీలన్నిటిని వదిలేసి ప్రజలను ఎలా మోసం చేశారో వివరించడం జరిగింది. ప్రజలను మోసగించడంలో చంద్రబాబు నాయుడు కు కొత్తేమి కాదని ఎన్నికల సమయంలోనే ఆయనకు ప్రజలు గుర్తొస్తారని, ఆ సమయంలో ఆయన నోటికి ఏదోస్తే ఆ హామీలను ప్రజలకు పరిపాటేన న్నారు. ఇప్పటివరకు అన్నదాతలకు అన్నదాత సుఖీభవకు ఎగనామం పెట్టారని తెలిపారు. అంతేకాకుండా మహిళలకు 1500 రూపాయలు, ఉచిత బస్సు ప్రయా ణం, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి వంటి హామీలను గాలికి వదిలేసారు అన్నారు. ఇవన్నీటిని మభ్యపరిచేందుకు వైసిపి నాయకులపై, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో రెడ్ అలర్ట్ లాగా రెడ్ బుక్ రాజ్యాంగం రాజ్యమేలుతోందని ఆయన కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. గత వైయస్సార్సీపి ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలన్నీ ప్రజల ఇంటి వద్దకే వచ్చేవని కానీ అలాంటి పరిస్థితులు నేడు లేవని తెలిపారు. గతంలో కులాలు చూడం, మతాలు చూడం, పార్టీలను అసలే చూడం అర్హులు అయితే చాలు ప్రతి ఒక్కరికి వారి ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు అందిస్తానని చెప్పిన నాయకుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి అని, నేడు అలాంటి పరిస్థితి కనుచూపుమేరలో కూడా కనిపించడం లేదని ఏ పనైనా టిడిపి కార్య కర్తలకు చేయాలని, వైసీపీ కార్యకర్తలకు నాయ కులకు చేయకూడదని చెప్పిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుదేనని ఆయన ప్రభుత్వ తీరుపై ఆయన మండిపడ్డారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాల న్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా ఎల్లప్పుడు ప్రజలకు వైయ స్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, ప్రజల పక్షాన పోరాడుతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్య క్రమంలో టిటిడి బోర్డు మాజీ సభ్యులు మాసిమ బాబు, వైయస్సార్సీపి మండల కన్వీనర్ జి ఎన్ భాస్కర్ రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, ముది రెడ్డి దిలీప్ రెడ్డి, వైయస్సార్సీపి రాష్ట్ర మహిళ కార్యవర్గ సభ్యురాలు దాదిరెడ్డి భాగ్యమ్మ, సర్పంచ్ తుంగ చంద్ర శేఖర్ యాదవ్,సొంట్లం నారాయణరెడ్డి, ఎంపీటీసీలు, దుంప నాగిరెడ్డి, నిరంజన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, మండల కో ఆప్షన్మెంబర్ వారిష్, శ్రీనివాసులు రెడ్డి, దలాయి కిరణ్, మైనార్టీ నాయకులు అన్వర్ భాష, హ్రస్రత్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.






## తిప్పాయపల్లె పంచాయతీ సెక్రటరీని అభినందించిన జిల్లా కలెక్టర్

**- చెత్త సేకరణ, వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాన్ని పురోగతిలో పెట్టిన పంచాయతీ సెక్రటరీ**

**పుల్లంపేట- సూర్య వాస్తవం, జూలై 23:** చెత్త సేకరణలో పురోగతి సాధించి, వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాన్ని పురోగతిలో పెట్టిన తిప్పాయపల్లె పంచాయతీ సెక్రటరీ గంగాధర్ను జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అభినందించారు. పుల్లంపేట మండలం తిప్పాయపల్లి గ్రామంలో వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాన్ని (ఎస్ డబ్ల్యూ పిసి) జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి బుధవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా.... గత నెల ఐదో తారీఖున తిప్పాయపల్లె గ్రామంలోని ఎస్ డబ్ల్యూ పిసి కేంద్రాన్ని సందర్శించినప్పటికీ నేటికీ ఎంతో మార్పు కనిపించిందని, తక్కువ సమయంలో అతి తక్కువ మంది గ్రీన్ అంబాసిడర్లను వినియోగించుకొని పనిలో ఎంతో పురోగతి సాధించిన తిప్పాయపల్లె పంచాయతీ సెక్రటరీ గంగాధర్ను జిల్లా కలెక్టర్ అభినందించారు. చెత్త సేకరణలో పురోగతిని ఇలాగే కొనసాగించాలని సూచించారు. జిల్లాలోని పంచాయతీ సెక్రటరీలు అందరూ ఇటువంటి పురోగతి సాధించి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దారు పుల్లారెడ్డి, ఎంపీడీవో జయశ్రీ, మండల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సాయి ఆస్పత్రి ఎండిని సన్మానించిన ఆర్ఎంపీ డాక్టర్లు





**పామిడి- సూర్యవాస్తవం, జులై 23:** పామిడి మండలంలో ఉన్న ఆర్ఎంపీ డాక్టర్ బుధవారం రోజున. ఆంధ్రప్రదేశ్ ఆర్ ఎం పి అసోసియేషన్ సభ్యుల సమావేశం పామిడి పట్టణంలో జరిగింది. ఆంధ్రప్రదేశ్ ఆర్ఎంపి డాక్టర్స్ అసోసియేషన్ వారి సేవలను గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయ రాం గుర్తించి పామిడి పట్టణ సాయి అస్పత్రి ఎండి అయిన చిలకల రాజగోపాల్‌ను ప్రభుత్వ అస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడుగా నియమించినందుకు కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు . అలాగే అస్పత్రి లో మెరుగయిన సేవలు లభించేలా కృషి చెయ్యాలని ఆర్ ఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ కోరింది. అలాగే మీ సేవలు గుర్తించి మరిన్ని అవకాశాలు ఇవ్వాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమం లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్ ఎం పి అసోసియేషన్ ప్రధాన కార్య దర్శి నాగ మస్తానయ్య, పామిడి మండల ఆర్ ఎం పి మండల అధ్యక్షులు నాగ మల్లా రెడ్డి,ఆర్ ఎం పి వైద్యులు అబ్దుల్ మజీద్, మల్లి కార్జున, పక్రుద్దీన్, శ్రీనివాసులు, అంజి చౌహన్ నాయక్, రాము, తదితరులు పాల్గొన్నారు.



## గాయపడిన అశోక్‌ని పరామర్శించిన సుగవాసి ప్రసాద్ బాబు

**రాయచోటి - సూర్య వాస్తవం, జులై 13:** రాయచోటి-గాలివీడు మార్గంలో బోయపల్లె వద్ద సోమవారం మధ్యాహ్నం స్కూటర్ ప్రమాదంలో ఎగువగొట్టివీడు కుమ్మరపల్లెకు చెందిన అశోక్ కుమార్ గాయపడి కడప జగదీష్ న్యూరో కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసి రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు మంగళవారం ఆసుపత్రికి వెళ్లి ప్రమాద విషయాలు, ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకొని త్వరలోనే పూర్తి స్థాయిలో సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ధైర్యం చెప్పి పరామర్శించారు.

## సమాచార హక్కు చట్టంపై అవగాహన




**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం, జులై 23 :** అనంతపురం నగరంలోని సహకార శాఖ అధికారి కార్యాలయంలో బుధవారం సాయంత్రం సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని జిల్లా సహకార శాఖ అధికారి అరుణ కుమారి అధ్యక్షత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార సంఘాల తనిఖీ అధికారి, విభాగ సహకార అధికారి కార్యాలయం అసిస్టెంట్ రిజిస్ట్రార్ లు ముని కృష్ణారెడ్డి, శివమ్మ, బాలగంగాధర్, శ్రీనివాసులు, రవి, తదితరులు హాజరయ్యారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.అల్తాఫ్, ఉపాధ్యక్షులు సుబ్బారాయుడు సమాచార హక్కు చట్టం గురించి సవివరంగా వివరించడమే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను కూడా అధికారులు సరిగా అమలు చేయడం లేదని, ప్రజలు దీనిపై స్పందించాలని వివరించడం జరిగింది. సమాచార హక్కు చట్టం గురించి అవగాహన కల్పించిన తర్వాత అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పడం జరిగింది. అవగాహన కార్య క్రమాన్ని చక్కగా వివరించారని జిల్లా సహకార శాఖ అధికారి ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ప్రతినిధులను సన్మానించారు.



## మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

**- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యే కొండబాబు**



**రాయచోటి -సూర్య వాస్తవం, జూలై 23:** కింతాడ వెంకటరావు కమ్యూనిటీ హాల్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 25 మంది మహిళలకు కుట్టుమిషన్లను రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు వనమూడి కొండబాబు పాల్గొన్నారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబుల వ్వాలని, ప్రభుత్వం నైపుణ్య శిక్షణతో పాటు అవసరమైన పరికరాలు అందించి సహకరిస్తుందన్నారు. మహిళలు తమ జీవితాల్లో స్వయం ఉపాధి ద్వారా ముందుకు వెళ్లాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి పలువురు స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.

## సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో హాకింగ్స్ స్కూల్ విద్యార్థికి 3వ ర్యాంక్




**కుప్పం - సూర్య వాస్తవం, జూలై 23 :** స్థానిక హాకింగ్స్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సాయి చరణ్ సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు సాధించినట్లు పాఠశాల చైర్మెన్, కరస్పాండెంట్ హఫీజ్ తెలిపారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన సన్మాన సభలో విజేత సాయి చరణ్ ను, అతని తల్లిదండ్రులను సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మెన్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ చిన్నతనం నుండే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను కలిగి ఉండాలని, ఆ లక్ష్యాలను సాధించే దిశగా బాల్యం నుండే పునాదులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎప్పటి పనులు అప్పుడే పూర్తి చేయాలని, ఏ పనిని వాయిదా వేయకూడదని నిరంతరం లక్ష్యసాధనలో నిమగ్నులు కావాలని హితువు పలికారు. రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించిన విద్యార్థిని అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలను అందుకోవాలని ఆకాంక్షించారు. హాకింగ్స్ పాఠశాలలో బోధించే సీబీఎస్ఈ సిలబస్ వలన తమ కుమారుడు శిక్షణ లేకుండానే రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంక్ సాధించడానికి తోడ్పడిందని, పాఠశాలలో ఉండే క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన పోటీ వాతావరణం, ఉపాధ్యాయుల ప్రోత్సాహం, పాఠశాల యాజమాన్య సభ్యుల సహకారం తమ కుమారుడు ఇవాళ విజేతగా నిలవడానికి కారణమయ్యాయని సాయి చరణ్ తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులందరూ విజేతగా నిలిచిన సాయిచరణ్ ను ఆదర్శంగా తీసుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ప్రిన్సిపాల్ షబ్బీర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అరుణాసింగ్ చౌహన్, బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## పదేళ్ల సమస్యకు పరిష్కారం...

**- డ్రైనేజీ సమస్య గురించి పట్టించుకోని వైసీపీ నాయకులు**
**- ఎమ్మెల్యే దగ్గుపాటి చొరవతో నూతన కాలువ నిర్మాణం**
**- ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన స్థానికులు, టీడీపీ నాయకులు**



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 23:** అనంతపురం నగరంలోని 20వ డివిజన్ లో పదేళ్లుగా ప్రజలు ఎదు ర్కొంటున్న సమస్యకు పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. డివిజన్ లోని పెద్దమ్మ గుడి బోయ వీధిలో గత కొన్నేళ్లుగా డ్రైనేజీ, రోడ్డు సమస్య ఉంది. చిన్నపాటి వర్షం వచ్చినా లేదా నీరు ఎక్కువగా వచ్చినా రోడ్లపై మురుగునీరు ప్రవహి స్తుండేది. దీనిపై వైసీపీ నాయకులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదు. ఇటీవల ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ దృష్టికి ఈ సమస్యను స్థానిక టీడీపీ నాయకులు షరీన, ఇమ్రాన్ లు తీసుకెళ్లారు. దీంతో వెంటనే నిధులు మంజూరు చేయించారు. నాలుగు రోజుల క్రితం మంత్రి నారాయణ చేతుల మీదుగా నగరంలోని పలు డ్రైనేజీలు, రోడ్లకు భూమి పూజ చేశారు. తాజాగా ఇందుకు సంబంధించిన పనులు కాలనీలో ప్రారంభమయ్యాయి. దీనిపై స్థానికుల్లో హర్షం వ్యక్తమవుతోంది. పదేళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం చూపారని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. సమస్య ఉందని చెప్పిన వెంటనే పరిష్కారం చూపించే నాయకుడు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అని స్థానిక టీడీపీ నాయకులు కొనియాడారు. ఈ పనులను మాజీ కో ఆప్షన్ సభ్యురాలు షరీన, 20వ డివిజన్ ఇంచార్జ్ ఇమ్రాన్ షైక్, టిడిపి డాక్టర్ సెల్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ ప్రసాద్, డివిజన్ నాయకులు వేణు, ఖాజు, దాదాపీర్, అలీ తదితరులు పరిశీలించారు.

## వ్యర్థపదార్థాల ప్రాసెసింగ్ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం ,జూలై 23:** రాజంపేట మండలం హస్తవరం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు వ్యర్థపదార్థాల ప్రాసెసింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి బుధవారం ఉదయం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యర్థపదార్థాల ప్రాసెసింగ్ కేంద్రంలోకి తడి చెత్త మరియు పొడి చెత్త లను వేరు చేసి తీసుకురావాలని గ్రామపంచాయతీలోని అన్ని కుటుంబాల నుండి చెత్త సేకరణ జరగాలని పంచాయతీ సెక్రటరీని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం హస్తవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసి.... విద్యార్థిని విద్యార్థులకు పెట్టే భోజనం తయారీ, మరుగుదొడ్ల నిర్వహణ, మౌలిక సదుపాయాలపై పాఠశాల యాజమాన్యానికి మరియు సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ తనిఖీ లో రాజంపేట తాసిల్దార్ పీర్ మున్ని, తదితరులు పాల్గొన్నారు.

## ఆరా యాప్ మోసాలపై ఫిర్యాదు

**మదనపల్లి --సూర్య వాస్తవం ,జూలై 23:** ఆరా యాప్‌లో పెట్టుబడి పెడితే ప్రతిరోజు ఇంట్లోనే కూర్చొని డబ్బు సంపాదించ వచ్చని నిర్వాహకులు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. దీంతో ఆశావహులు పెట్టుబడి పెట్టి




మోసపోయారు. బాధితులు బుధవారం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు తెలిపిన వివరాలు.. మండలంలోని కోళ్లబైలు పంచాయతీ, ఎగువ కురువంకకు చెందిన మోహన్ బాబు అనే వ్యక్తి ఆరా యాప్ లో పెట్టుబడి పెడితే ప్రతిరోజు ఇంట్లోనే కూర్చొని డబ్బు సంపాదించవచ్చని నమ్మించాడు. ఇందులో రూ. 2 వేలు పెడితే రోజుకు ఐదు వీడియోలు వస్తాయని వాటిని వీక్షిస్తే ఒక్కో వీడియో కు రూ. 65లు సంపాదించవచ్చునని, రూ. 5,400 పెట్టుబడి పెడితే పది వీడియోలు వస్తాయని వాటి వీక్షిస్తే ఒక్క వీడియోకు రూ. 160 లు వస్తాయని చెప్పారు. ఇలా రూ.32 లక్షల పెడితే 200 వీడియో లు వస్తాయని వాటిని వీక్షిస్తే రోజుకు రూ. 1,50,000 సంపాదించవచ్చని ప్రచారం సాగించారు. దీంతో పాటు స్పిన్ బాల్ ను టచ్ చేస్తే అందులో టీవీలు, లాప్ టాప్ లు, మొబైల్స్ బహుమతులు తగులుతాయని, వాటిని అరా యాప్ సభ్యులకు ఇస్తారని నమ్మ బలికారు. దీంతో పలువురు ఆశావహులు ఇందులో పెట్టుబడి పెట్టగా ఎవరికి డబ్బులు రాలేదు. బహుమతులు రాలేదు. దీంతో మోసపోయామని గ్రహించి తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేస్తామని పోలీసులు తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణకు ముందుకు రావాలి



**కుప్పం -సూర్య వాస్తవం, జూలై 23:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని బిసిఎన్ విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు బిసి నాగరాజు పిలుపునిచ్చారు. కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం కళాశాల అధ్యక్షుల ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సమీర్ భాషా, బీట్ ఆఫీసర్లు సుధాకర్, మధు దేశవంత్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కళాశాల వ్యవస్థాపక అధ్యక్షులు మాట్లాడుతూ నేటి పారిశ్రామికీకరణ యుగంలో పర్యావరణం గురించి ఆలోచించడం చాలా ముఖ్యమని, కొన్ని దశాబ్దాలుగా చెట్లను నరికివేయడం వల్ల పర్యావరణ హానికలుగుతోందని, ఇందువల్ల పర్యావరణ వ్యవస్థలో వేగంగా మార్పులు కనిపిస్తోందన్నారు. పెరుగుతున్న కాలుష్యంతో ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించడానికి ఏకైక మార్గం చెట్లను పెంచడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా ఎస్. బాస్కరన్, ఆర్.అండ్ డి డైరెక్టర్ డా. జి.ఎన్. కోదండరామయ్య, ఎన్.ఎస్.ఎస్. విభాగం కోఆర్డినేటర్లు జె. మాధవన్, ఎం. గంగాధరన్, డాక్టర్ సి జి శ్రావణ,ఎన్ ఎస్.ఎస్. వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హరిహర వీరమల్లు సంబరాలు

**గుత్తి-సూర్య వాస్తవం,జులై 23:** గుత్తి లో పవన్ కళ్యాణ్ అభిమానుల సంబరాలు సినీ హీరో,డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రం ఇవాళ రాత్రి విడు



దల సందర్భంగా గుత్తిలోని అ మృత థియేటర్ వద్ద నుండి మెగా ఫ్యామిలీ అభిమానులు జన సేన నాయకులు కార్యకర్తలు సం బరాలు చేసుకున్నారు పవన్ క ళ్యాణ్ చిత్రపటాన్ని గుత్తి పట్టణం లోని పురవీధుల గుండా భారీ మే ళతాళాల నడుమ డ్రమ్స్ లతో భారీ ర్యాలీ ద్వారా బాణా సంచా లతో ఊరేగించారు ఈ సంబరాల లో పాటిల్ సురేష్,బోయగడ్డ బ్ర హ్మయ్య మిద్దె ఓబులేష్,అశ్వనా గప్ప,హరి,షేక్షా,వంశీ,మురళి నా యక్ తదితరులు పాల్గొన్నారు.

### నాణ్యమైన మద్యం అంటూ రూ.99కే

# నాసిరకం మద్యం తెచ్చిన ఘనత చంద్రబాబుదే

**- వేధించేందుకే మిథున్ రెడ్డి అక్రమ అరెస్ట్**
**- మైనార్టీ నేతల విమర్శ**




**అనంతపురం - సూర్య వాస్తవం, జూలై 23:** దేశంలో ఏ రాజకీయ నాయకుడు చెప్పని విధంగా నాణ్యమైన మద్యం ఇస్తామంటూ హామీ ఇచ్చి రూ.99కే నాసిరకం మద్యం తెచ్చిన ఘనత చంద్రబాబునాయుడు కు మాత్రమే దక్కుతుందని నగర మేయర్ మహమ్మద్ వసీం విమర్శించారు. జిల్లా వైసీపీ కార్యాలయంలో మేయర్ మహమ్మద్ వసీం మైనార్టీ నేతలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మేయర్ మహమ్మద్ వసీం మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు సైఫుల్లా బేగ్ ,రాష్ట్ర జనరల్ సెక్రటరీ కాగజ్ ఘర్ రిజ్వాన్, మహిళా నాయకురాలు కమార్ తాజ్‌లతో కలసి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగానికి తిలోదకాలు ఇచ్చి కూటమి నేతలు రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వైసీపీ శ్రేణులపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు రెడ్ బుక్ లో పేర్లు రాసుకుని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి దగ్గరగా ఉన్న వారిపై అక్రమ కేసులు పెడుతూ వేధిస్తున్నారని విమర్శించారు. ఎలాంటి అవినీతి మచ్చలేని 3 సార్లు ఎంపీగా వైసీపీ రీజినల్ కో ఆర్డినేటర్ గా కొనసాగుతున్న మిథున్ రెడ్డిపై ఆధారాలు లేకున్నా అక్రమ కేసు పెట్టారన్నారు.లిక్కర్ స్కామ్ పేరిట అనేక మంది నాయకులపై కేసులు పెడుతున్నారని,వాస్తవానికి నాడు వైసీపీ హయాంలో లిక్కర్ స్కామ్ జరిగిందా నేడు కూటమి ప్రభుత్వంలో లిక్కర్ స్కామ్ జరుగుతోందా అని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ ఆధీనంలోనే మద్యం షాప్ లు నిర్వహించారని అలాంటప్పుడు స్కామ్ కు ఆస్కారం ఎక్కడ ఉందన్నారు.నేడు కూటమి నేతలే మద్యం షాప్ లు నడుపుతూ,24 గం. లు మద్యం అమ్మకాలు చేస్తూ, ఎంఆర్ పి కంటే అధిక ధరలకు అమ్ముతూ, విచ్చలవిడిగా బెల్ట్ షాప్ ల పేరిట దోచుకుంటు స్కామ్ లకు పాల్పడుతున్నారని ఆరోపించారు.ఎంపీ మిథున్ రెడ్డిని ఇబ్బంది పెట్టాలనే కేసు పెట్టారని,జైలులో సౌకర్యాలు కల్పించాలని హైకోర్టు ఆదేశించినా అమలు చేయడం లేదని విమర్శించారు.కూటమి నేతలు ఎన్ని అక్రమ కేసులు పెట్టినా వైసీపీ శ్రేణులు బయపడరని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వెంటే నడుస్తారని ఆయన స్పష్టం చేశారు. మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు సైఫుల్లా బేగ్ మాట్లాడుతూ వైసీపీ ప్రజలలో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే కూటమి ప్రభుత్వం ఆడుతున్న నటకమే ఈ అక్రమ అరెస్టులు అని విమర్శించారు.లేని మద్యం కుంభకోణం కట్టుకథ అల్లి అందరినీ అరెస్ట్ చేసుకుంటూ పోతున్నారన్నారు. ఎల్లో మీడియా చంద్రబాబు దర్శకత్వంలో జరుగుతున్న అరెస్ట్ లేనని విమర్శించారు. రాష్ట్ర జనరల్ సెక్రటరీ కాగజ్ ఘర్ రిజ్వాన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేక చేతులు ఎత్తేసే పరిస్థితి ఏర్పడటంతో డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగానే అక్రమ అరెస్ట్ లు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏకెఎస్ ఫయాజ్, కార్పొరేటర్లు రహంతుల్లా, ఇషాక్,అభూ సాలెహా,కో అప్షన్ సభ్యులు షంషుద్దీన్ ,ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్రపాడు హుస్సేన్ పీరా,నాయకులు ఏ1రఫీ,దాదా ఖలీందర్ ,గుల్జార్ పేట దాదు, జావిద్, రియాజ్ ,మహబూబ్ బాషా ,ఆదామ్, అబ్బాస్,నిజాం,ఆసిఫ్,హుస్సేన్ పీరా,తబ్రేజ్,ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ప్రాజెక్టులకు

# ప్రభుత్వ భూముల కేటాయింపులు వేగవంతం చేయాలి

**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం, జులై 23 :** జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించి ప్రభుత్వ భూముల కేటాయింపులు వేగవంతంగా చేపట్టాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ సెక్టార్, సివిల్ సప్లైయిస్, తదితర అంశాలపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీఓలు, డీఎస్ఓ, తహసిల్దార్ లు, ఆర్ఎస్డిటిలు, తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇంచార్జి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏపీఐఐసీ, అన్న క్యాంటీన్లు, జడ్జిల కాంప్లెక్స్ లు, రైల్వే ప్రాజెక్టులు, నెడ్ క్యాప్, మైనర్ ఇరిగేషన్, ఎన్. హెచ్544డి, తదితర ప్రాజెక్టులకు సంబంధించి భూమ ులను గుర్తింపు, కేటాయి ంపులను వేగంగా చేప ట్టాలన్నారు. ఆయా ప్రభుత్వ ప్రాజెక్టులకు సంబంధించిన ప్రతిపాదనలు త్వరితగతిన అందజ ేయాలని, ఈ విషయమై ఎప్పటికప్పుడు పురోగతి తీసుకుం ావడంపై



దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. హౌస్ సైట్ దరఖాస్తులకు సంబంధించి పెండింగ్ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. సివిల్ సప్లైయిస్ పరిధిలో ఈనెల 25వ తేదీ నాటికి ఎంఎల్ఎస్ పాయింట్లకు సరకుల రవాణా పూర్తి చేయాలని, ఇప్పటివరకు జిల్లాలో 37 శాతం స్టాక్ పంపిణీ పూర్తి చేయడం జరిగిందని, మిగిలినది రెండు రోజుల్లోపు పూర్తి చేయాలని, ఎంఎల్ఎస్ పాయింట్లను ఆర్డీఓలు తనిఖీలు చేయాలన్నారు. ఈ విషయమై నిత్యం మానిటర్ చేసి నిత్యవసరాల సరుకుల రవాణా వెంటనే పూర్తి చేయాలని, 26వ తేదీ నుంచి సరుకుల పంపిణీ చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో సిఎస్డిటిలు, తహసిల్దార్లు ఎఫ్.పి షాపులను తనిఖీలు చేయాలన్నారు. అంతకు ముందు ఆయా శాఖల అధికారులతో జీరోపావర్టీ పీ4పై సమీక్ష నిర్వహించారు. పీ4పై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ కార్యక్రమం కింద మార్గదర్శకులను గుర్తించడం, బంగారు కుటుంబాలను దత్తత ఇవ్వడం చేయాలని, ఇందులో కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు పురోగతి తీసుకు రావాలని ఆదే శించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డిఆర్ఓ ఏ.మలోల, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, డిఎస్ఓ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఒదివీడు సచివాలయ సిబ్బందికి ఘన సన్మానం

**- వారి సేవలే వారిని సత్కరించాయి : ఎల్జి రాజు**



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, జూలై 23 :** అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గం వీరబల్లి మండలంలోని ఒది వీడు గ్రామం లో గల సచివాలయ సిబ్బ ందికి బుధవారం ఘన సన్మానం లభించింది. సచివాలయం సిబ్బంది గత ఐదు సంవత్సరాల నుండి ఓదివీడు గ్రామ సమీపంలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ సచివాలయంలో ప్రజలకు అందించిన సేవలే నేడు వారికి సత్కరించాయంటూ ఆ గ్రామ ప్రజలు పేర్కొన్నారు. ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకుని ఆ గ్రామం నుండి పలు మండలాలకు బదిలీ అయిపోయిన సిబ్బందికి ఆ గ్రామస్తులు తోపాటు ఆ గ్రామ నాయకుడు ఎల్జి రాజు దుశ్శాలువతో అందరిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ సినిమా ఘన విజయం సాధించాలని ప్రత్యేక పూజలు

**కదిరి -సూర్య వాస్తవం, జూలై 23:** ఈనెల 24 వతేదీన విడుదలవుతున్న హరిహర వీరమల్లు సినిమా ఒక పోరాట యోధుడి చరిత్రను ఈ రాష్ట్రం, దేశంలోని ప్రజలందరికీ చరిత్రను తెలియజేయడంతో పాటు రికార్డులు సృష్టించడం ఖాయమని జనసేన పార్టీ గాండ్లపెంట మండల అధ్యక్షులు భూక్య రవీంద్ర నాయక్ తెలిపారు. వీరమల్లు సినిమా విడుదల సందర్భంగా ఆ సినిమా విజయవంతం కావాలని కోరుతూ బుధవారం రామాలయం.

గంగమ్మ ఆలయాలలో ప్రత్యేక పూజలు చేసి 101 కొబ్బరికాయలు కొట్టి సంబరాలు చేసి పవన్ కళ్యాణ్ సినిమా అంటే వినోదంతో పాటు ప్రజలకు ఏదో ఒక మెసేజ్ ను కూడా తెలియజేసే విధంగా ఉంటుందని వారు తెలిపారు. ఉపముఖ్యమంత్రి అయిన తర్వాత విడుదలవుతున్న మొదటి సినిమా అవడం వలన అటు అభిమానుల్లోనూ, ప్రజల్లోనూ జనసేన కార్య కర్తల్లో నూ ఈ సినిమాపై ఒక అంచనా ఏర్పడిందని, దానికి ఏమాత్రం తగ్గకుండా హరిహర వీరమల్లు సినిమా ప్రజల ఆదరణ పొందుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్ పి కుంట మండల కన్వీనర్ చౌదరి గోవిందు వినోద్ సోము మోహన షాను మధు హరి నాయక్ వెంకటేష్ నాయక్ లోకేష్ నాయక్ మహేష్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## చిరంజీవి అప్పుడు చేసిన ప్రామిస్ ఇప్పటికి ?

### - వాస్తవానికి ఆ పాత్ర కోసం క్యాథరీన్ తీసుకోవాలనుకున్నారు. అప్పటికి క్యాథరీన్ మంచి ఫాంలో ఉంది



మెగాస్టార్ చిరంజీవి -ఖైదీ నెంబర్ 150వ చిత్రంతో కంబ్యాక్ అయిన సంగతి తెలిసిందే. రాజకీయాలకు రిటైర్మెట్ ప్రకటించిన తర్వాత తీసుకున్న నిర్ణయం ఇది. ఎంతో మంది దర్శకుల్ని పరిశీలించి చివరికి వి. వినాయక్ ను దర్శకుడిగా ఫైనల్ చేసారు. కోలీవుడ్ లో విజయ్ నటించిన కత్తి సినిమాకు రీమేక్ రూపం ఇది. మాతృకను మురగదాస్ తెరకెక్కించగా....రీమేక్ అవకాశం ఆయనకు కూడా ఇచ్చారు. కానీ ఆ ఛాన్స్ ను సున్నితంగా తిరస్కరించారు. ఇందులో చిరంజీవికి జోడీగా కాజల్ అగర్వాల్ ను తీసుకున్నారు. ఆ 9 నెలల గ్యాప్ లో కానిచ్చేస్తారా? వాస్తవానికి ఆ పాత్ర కోసం క్యాథరీన్ తీసుకోవాలనుకున్నారు. అప్పటికి క్యాథరీన్ మంచి ఫాంలో ఉంది. ఈనేపథ్యంలో హీరోయిన్ గా ఆమె పేరు తె రపైకి వచ్చింది. కానీ ఆమె కంటే కాజల్ అయితే బాగుంటుందని ఆలోచన విరమించుకున్నారుఏ. అనంతరం అదే సినిమాలో ఐటం పాట కోసమైనా క్యాథరీన్ ను తీసుకో వాలనుకున్నారు కానీ అదీ సాధ్యపడలేదు. రత్తాలు పాట కోసం రాయ్ లక్ష్మిని తీసుకున్నారు. అలా చిరం జీవి క్యాథరీన్ కు బాకీ పడిపోయారు. ఆ తర్వాత చిరజీవి చాలా సినిమాలు చేసారు. కానీ ఏ సినిమాలోనూ క్యాథరీన్ కు అవకాశం ఇవ్వలేదు. ఈ క్రమంలో క్యాథరీన్ గ్రాఫ్ కూడా పడిపోయింది. అలా చిరుతో ఛాన్స్ కు దూరమవ్వాల్సి వచ్చింది. అయితే ఇచ్చిన మాట ప్రకారం ఇప్పుడా ఛాన్స్ 157వ సినిమాతో నిరూపిం చుకుంటున్నారు. అనీల్ రావిపూడి దర్శ కత్వంలో చిరంజీవి 157వ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో చిరంజీవికి జోడీగా నయ నతార నటిస్తోంది. మరో లీడ్ రోల్ లేదా? ఐటం పాటలో క్యాథరీన్ నటించే అవకాశం ఉంది. ఇప్పటికే ఆమె ఎంట్రీ ఖరారైంది. కానీ అది పాత్ర కోసమా? ఐటం పాట కోసమా? అన్నది క్లారిటీ లేదు. ఈ విషయంలో చొరవ తీసుకుంది చిరంజీవి. ఆ రోల్ కోసం అనీల్ మరో నటిని అనుకున్నారుట. కానీ చిరం జీవి అడగడంతో ఆయన మాట కాదనలేక అనీల్ క్యాథరీన్ కి ఛాన్స్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

## ‘హరి హర వీరమల్లు’ విడుదల

### - పది రోజులపాటు టికెట్ ధరల పెంపు




పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటించిన పీరియాడిక్ యాక్షన్ మూవీ ‘హరి హర వీరమల్లు’. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకులు. నిధి అగర్వాల్ కథానాయిక. ఎఎం రత్నం నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా గురువారంనాడు పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా టికెట్ ధరలను పెంచుకునేందుకు అనుమతి ఇస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సినిమా విడుదలైన మొదటి రెండు వారాలు రేట్లు పెంచేందుకు అనుమతి ఇవ్వాలని చిత్ర నిర్మాత ప్రభుత్వాన్ని కోరగా, కేవలం మొదటి 10 రోజులకే రేట్లు పెంచడానికి ప్రభుత్వం అవకాశమిచ్చింది. ఈనెల 24 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకూ పెంచిన టిక్కెట్ల ధరలు అమల్లో ఉంటాయి. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ఒక్కో లోయర్ క్లాస్‌పై రూ.100 (జిఎస్‌టితో కలిపి) అప్పర్ క్లాస్‌పై రూ.150 (జిఎస్‌టితో కలిపి) పెంచుకునే వెసులుబాటు కల్పించగా, మల్టీప్లెక్స్‌లో రూ.200 (జీఎస్టీతో కలిపి) వరకు పెంచేందుకు అనుమతి ఇచ్చింది. బుధవారం రాత్రి 9గంటల పెయిడ్ ప్రీమియర్ ప్రదర్శనలకు కూడా అంగీకరించింది. ఈ టికెట్ ధర రూ.600 (జిఎస్‌టి అదనం) నిర్ణయించారు. ఎంపిక చేసిన కేంద్రాల్లో మాత్రమే ఈ షోకు అనుమతి ఉంది. సినిమా విడుదల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో పాటు, పోలీస్‌శాఖకు కూడా మార్గనిర్దేశం చేసింది.

## 26న ‘మిరాయ్’ ఫస్ట్ సింగిల్



తేజా సజ్జా హీరోగా, కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ‘మిరారు’. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా సాగుతోంది. తాజాగా ఈ చిత్రం నుండి ఫస్ట్ సింగిల్‌ని జులై 26న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది.

ఫీల్‌తో పాటు మ్యాజికల్ మెలోడీకి ప్రాధాన్యం ఉండేలా ఈ పాటను రూపొందించారని మేకర్స్ పేర్కొన్నారు. ఈ విషయం తెలుపుతూ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. ఈ సినిమాలో తేజా సజ్జా ఒక సూపర్ యోధుడిగా కనిపించనుండగా, మంచు మనోజ్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. రిథికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీ 8 భాషలలో సెప్టెంబర్ 5న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.



## రాణించిన జైస్వాల్, కెఎల్ రాహుల్.. ఇండియా 264/4

### - తొలి వికెట్‌కు 94పరుగుల భాగస్వామ్యం
### - పంత్ కాలికి తీవ్ర గాయం




**మాంచెస్టర్:** మాంచెస్టర్ వేదికగా ఇంగ్లండ్‌తో ప్రారంభమైన నాలుగో టెస్ట్‌తో టీమిండియా ఓపెనర్లు శుభారంభం అందించారు. జైస్వాల్, సాయి సుదర్శన్ అర్ధసెంచరీలతో రాణించడంతో తొలిరోజు ఆట నిలిచే సమయానికి భారతజట్టు 4 వికెట్ల నష్టానికి 264 పరుగులు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారతజట్టుకు ఓపెనర్లు కెఎల్ రాహుల్-జైస్వాల్ ఆదుకున్నారు. తొలి సెషన్ ముగిసేసరికి వికెట్ నష్టపోకుండా 76 పరుగులు చేసిన భారత్‌ను కేఎల్ రాహుల్ 39, యశస్వి జైస్వాల్ 35 పరుగులతో రాణించారు. వీరిద్దరూ ఆచి తూచి ఆడుతూ.. అందివచ్చిన బంతులను బౌండరీలకు తరలిస్తూ గట్టి పునాది వేశారు. జట్టు స్కోర్ 94 పరుగుల వద్ద భారతజట్టు తొలి వికెట్ కోల్పోయింది. కెఎల్ రాహుల్(46) వద్ద క్రిస్ వోక్స్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత యశస్వి జైస్వాల్(58) అర్ధసెంచరీ పూర్తయ్యాక డాసన్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. దీంతో భారతజట్టు 120 పరుగుల వద్ద రెండో వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత ఆదుకుంటాడనుకున్న శుభ్‌మన్ గిల్(12) కూడా నిరాశపరచడంతో భారత్ 140 పరుగుల వద్ద మూడో వికెట్ కూడా కోల్పోయి కష్టాల్లో పడింది. కేవలం 46పరుగుల వ్యవధిలో భారతజట్టు మూడు వికెట్లు కోల్పోయింది. రెండో సెషన్‌లో ఇంగ్లండ్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వా రిషబ్ పంత్(37నాటౌట్) ధనాధన్ ఇన్నింగ్స్‌తో స్కోర్‌బోర్డును పరుగెత్తించాడు. మరోవైపు సాయి సుదర్శన్ కూడా అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో రిషబ్ పంత్ కాలికి బంతి తగిలి తీవ్ర గాయమైంది. దీంతో అతడు కారులో మైదానాన్ని వీడాల్సి వచ్చింది. తొలిరోజు ఆట నిలిచే సమయానికి జడేజా(19), శార్దూల్(19) క్రీజ్‌లో ఉన్నారు. ఈ టెస్ట్‌కు భారతజట్టు మూడు మార్పులతో బరిలోకి దిగింది. ఇంగ్లండ్ బౌలర్లు స్టోక్స్‌కు రెండు, వోక్స్, డాసన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. కరుణ్ నాయర్ స్థానంలో సాయి సుదర్శన్, నితీశ్ రెడ్డి స్థానంలో శార్దూల్ ఠాకూర్, ఆకాశ్ దీప్ స్థానంలో అన్షుల్ కాంబోజ్‌కు చోటు దక్కించుకున్నారు.

**స్కోర్‌బోర్డు:** భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)బ్రూక్ (బి)డాసన్ 58, కెఎల్ రాహుల్ (సి)క్రాలే (బి)వోక్స్ 46, సాయి సుదర్శన్ (సి)కర్సే (బి)స్టోక్స్ 61, గిల్ (ఎల్‌బి)స్టోక్స్ 12, పంత్ (రిటైర్డ్ హర్ట్) 37, జడేజా (బ్యాటింగ్) 19, శార్దూల్ (బ్యాటింగ్) 19, అదనం 12. (83 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 182 పరుగులు.

## ప్రి క్వార్టర్స్‌కు సింధు

### - చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ



**హాంగ్జౌ:** చైనా ఓపెన్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లకు రాణించారు. రెండోరోజైన బుధవారం పివి సింధు, చిరాగ్-సాత్విక్ జంట ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లారు. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో పివి సింధు ఏకంగా 6వ సీడ్, 18ఏళ్ల మియాజకి(జపాన్)ను చిత్తుచేసింది. మియాజకిపై సింధు గెలుపొందడం ఇది వరుసగా రెండోసారి. హెూరాహెూరీగా సాగిన ఈ గేమ్‌లో సింధు 21-15, 8-21, 21-17తో మియాజకిని చిత్తుచేసింది. తొలి గేమ్ ప్రారంభం నుంచి సింధు అద్భుతంగా రాణించింది. తొలుత ఏకంగా ఏడు పాయింట్లు సాధించి ప్రత్యర్థికి గుక్క తిప్పుకోకుండా చేసింది. ఇక రెండో గేమ్‌లో మియజకి ప్రారంభం నుంచి చెలరేగి 12-8 పాయింట్ల ఆధిక్యతలో నిలిచింది. ఇరువురు షట్లర్ల మధ్య జరిగిన ఈ గేమ్ సుమారు 62 నిమిషాలసేపు సాగింది. జపాన్ ఓపెన్ సూపర్-750 తొలిరౌండ్‌లో ఓడిన సింధు.. ఈసారి రాణించడం విశేషం. ఇక పురుషుల డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ జంట జపాన్ జంటను వరుససెట్లలో ఓడించింది. ఏకపక్షంగా సాగిన ఈ గేమ్‌లో సాత్విక్-చిరాగ్ 21-13, 21-9తో కెన్యా మిట్సుషి-హిరోకీ జంటను ఓడించారు. మలేషియా ఓపెన్, ఇండియా, సింగపూర్ ఓపెన్‌లలో భారత డబుల్స్ జంట సెమీస్ గండం దాటలేకపోయింది.

### మళ్లీ రగడ.. ఇంగ్లండ్ కు

## క్రీడా స్ఫూర్తి లేదన్న భారత కెప్టెన్ గిల్

### - బుధవారం నుంచి నాలుగో టెస్టు ప్రారంభం కానుండగా.. మంగళవారం ప్రెస్ కాన్ఫరెన్స్ లో గిల్ మాట్లాడాడు



బంతి పాతబడడం.. ఆటగాళ్ల మధ్య వాగ్వాదం.. ఇంకా అనేక కారణాలతో భారత్-ఇంగ్లండ్ టెస్టు సిరీస్‌లో వరుసగా వివాదాలు చుట్టుముడుతూనే ఉన్నాయి.. దీనికితోడు కొత్తగా కావాలనే సమయాన్ని వేస్ట్ చేయడం అనే అంశంపై రగడ జరుగుతోంది. “ఇంగ్లండ్ ఆటగాళ్లు కావాలని ఆలస్యం చేస్తున్నారు” అంటూ భారత కెప్టెన్ శుబ్‌మన్ గిల్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపేలా ఉన్నాయి. బుధవారం నుంచి నాలుగో టెస్టు ప్రారంభం కానుండగా.. మంగళవారం ప్రెస్ కాన్ఫరెన్స్‌లో గిల్ మాట్లాడాడు.అయినా ఇంగ్లండ్ ఓపెనర్లు టైం వేస్ట్ చేశారని గిల్ ఆరోపించాడు. ఇది క్రీడా స్ఫూర్తి కాదన్నాడు. దీంతో తనకు కోపం వచ్చిందని గిల్ తెలిపాడు. అయితే, క్రాలీ విషయంలో టీమ్ ఇండియా ఆటగాళ్ల తీరును ఇంగ్లిష్ మీడియా వెక్కిరించింది.


PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )